
మన క్రాంతి
KR TV
ఇది వాస్తవ పత్రిక...
Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati
సంపుటి: 02 సంచిక 69 | బుధవారం 25 ఫిబ్రవరి 2026 | ఎడిటర్ : సందెపల్లి క్రాంతి కుమార్ | పేజీలు: 8 వెల: 3 రూ/-


## నేటి మాట

ప్రయత్నం చేసి ఓడిపో కానీ
ప్రయత్నం చేయడంలో
మాత్రం ఓడిపోకు



-స్వామి వివేకానంద

## బంగ్లాలో ఆర్మీలో భారీ మార్పులు..
## ఇండియాలోని అధికారికి ప్రమోషన్!

- తారిక్ రహమాన్ కీలక నిర్ణయాలు
- హాఫీజుర్‌కు మేజర్ జనరల్ హోదా
- ఇంటెలిజెన్స్‌లో కొత్త నియామకాలు
- అధికారంలోకి బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ



2 లో

# భూదాన భూముల్లో హై టెన్షన్

## తమ ఇళ్లను తొలగించొద్దంటూ బాధితుల వేడుకోలు

న్యూస్ డెస్క్, 24 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): ఖమ్మం కలెక్టరేట్ సమీపంలో గల 60 ఎకరాల భూదాన భూమిలో హై టెన్షన్ వివాదం నెలకొంది. 2014లో 62 ఎకరాల భూదాన భూమిలో దాదాపు 18 ఎకరాల్లో 600 కుటుంబాలు రెండు వేల జనాభా ఇండ్లు లేని నిరుపేదలు ఇండ్లు నిర్మించుకొని అక్కడ నివసిస్తున్నారు. తమ నిర్మించుకున్న భూమికి పట్టాలు ఇవ్వాలని అధికారుల చుట్టూ తిరుగుతూ అధికారులకు విన్నవించుకున్న పట్టాలు ఇవ్వడం లేదని కానీ, అదే భూమి పక్కన రియల్ ఎస్టేట్ వ్యాపారులు తమ వ్యాపారాలను కొనసాగిస్తుండగా, మరోవైపు కబ్జాదారులు అధికారులు సైతం వారికి కొమ్ముకాస్తున్నారని భూదాన బాధితులు ఆరోపిస్తున్నారు. మంగళవారం తెల్లవారుజాము నుంచి వందలాది మంది పోలీసు బలగాలతో మున్సిపల్ సిబ్బంది వందల ట్రాక్టర్లు జెసిబిలతో భూదాన భూమి ఆవరణలోకి చేరుకున్నారు.

వందలాది పోలీసులు ఒక్కసారిగా భూదాన భూముల్లోకి అడుగుపెట్టడంతో స్థానికంగా నివసిస్తున్న పేద ప్రజలు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. తము నిర్మించుకున్న ఇండ్లను తొలగించవద్దని అధికారుల కాళ్ళ వేళ్ల పడ్డ కనికరించకుండా రేకుల షెడ్డు గుడిసెలను జెసిబి లతో తొలగించడంతో స్థానికులు కన్నీరుమున్నీరయ్యారు. స్థానికులు సైతం పోలీసులకు ఎదురు పడటంతో



2 లో

ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. వందల ఎకరాల భూములు రాజకీయ నాయకులు కబ్జా చేస్తున్నప్పటికీ వారిని పట్టించుకోకుండా ఇండ్లు లేని నిరుపేదలు ఇండ్లు నిర్మించుకొని నివసిస్తుంటే నిరుపేదల గుడిసెలను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్దాక్షణ్యంగా కూల్చివేస్తుందని బాధితులు వాపోతున్నారు.

## మూసీ నది ఒడ్డున
## గాంధీ విగ్రహ ఏర్పాటు

- భూసేకరణపై వివాదం
- తుషార్ గాంధీ ట్వీట్ వైరల్
- సీఎంను ట్యాగ్ చేసిన తుషార్
- నిర్వాసితుల ఆందోళన
- నిర్ణయం పునరాలోచన డిమాండ్



2 లో

## ఎయిర్ అంబులెన్స్ కూలిన
## ఘటనలో ఏడుగురు మృతి..

- ఛాత్రా ఆస్పత్రిలో పోస్టు మార్టమ్
- రాంచీ నుంచి ఢిల్లీకి బయల్దేరిన విమానం
- ఏటీసీతో కాంటాక్ట్ తెగిపోవడంతో ప్రమాదం
- ఇద్దరు పైలెట్లు సహా వైద్య బృందం మృతి
- ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో దర్యాప్తు ప్రారంభం



2 లో

# దేవాదుల సాక్షిగా పరిష్కారం

## సీఎం రేవంత్ రెడ్డి



- కృష్ణా-గోదావరి జలాలపై చర్చల ద్వారానే శాశ్వత పరిష్కారం
- పంచాయితీలకు బదులు స్నేహపూర్వక చర్చలకే సీఎం ప్రాధాన్యం
- ప్రతి పౌరుడికి తాగునీరు - ప్రతి ఎకరాకు సాగునీరు లక్ష్యం
- జలాల సాధనలో రాజీలేని పోరాటం చేస్తామని స్పష్టం
- కృష్ణా జలాల్లో సమాన వాటా కోసం తెలంగాణ డిమాండ్
- శ్రీశైలం-నాగార్జున సాగర్ నిర్వహణపై మళ్లీ వివాదం
- కాళేశ్వరం, పోలవరం ప్రాజెక్టులపై పరస్పర అభ్యంతరాలు
- జల వివాదాలపై ఏపీ స్పందన ఎలా ఉంటుందో ఆసక్తి

మిగతా 2 లో

న్యూస్ డెస్క్, 24 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్)

తెలుగు రాష్ట్రాల మధ్య దశాబ్దాలుగా నెలకొన్న కృష్ణా, గోదావరి జలాల పంపిణీ అంశాలు ఇంకా అపరిష్కృతంగానే ఉన్నాయి. జల సాధనలో ఘర్షణల కంటే చర్చల ద్వారానే శాశ్వత పరిష్కారాలు సాధ్యమని, ప్రజా ప్రయోజనాలే పరమావధిగా అడుగులు వేయాల్సిన అవసరం ఉందని పలువురు మేధావులు సూచిస్తున్నారు. ఈ క్రమంలోనే మంగళవారం సీఎం రేవంత్ రెడ్డి ట్విట్టర్ వేదికగా ట్వీట్ చేశారు. దేవాదుల సాక్షిగా కృష్ణా, గోదావరి జలాల సాధనలో వివాదమా, పరిష్కారమా అంటే తాము పరిష్కారం కోరుకుంటామని అన్నారు. చర్చలా, పంచాయితీనా అంటే తాము చర్చలే కోరుకుంటామని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రతి పౌరుడికి తాగునీరు, ప్రతి ఎకరాకు సాగునీరు అందివ్వడమే తమ ప్రభుత్వం మందున్న టార్గెట్ అని సీఎం రేవంత్ రెడ్డి ట్వీట్ చేశారు.

## ఘోర అగ్నిప్రమాదం
## ఒకే ఇంట్లో ఆరుగురు సజీవదహనం

- మీరట్ లో విషాదం
- ఆసుపత్రిలో మృతిగా ధ్రువీకరణ
- షార్ట్ సర్క్యూట్ అనుమానం
- పోలీసుల దర్యాప్తు ప్రారంభం



2 లో

## బార్పేటా రోడ్‌లో
## సినిమా తరహా దోపిడీ..

- 12 కోట్ల విలువైన నగలు మాయం
- అస్సాంలో సంచలనం
- 'సెన్కో అలంకార్' షోరూమ్ టార్గెట్
- సీసీటీవీ హార్డ్‌డిస్కులు ఎత్తుకెళ్లారు
- నలుగురు అరెస్ట్.. ఒకరు పరారీ



2 లో

## "ఫేక్ న్యూస్‌పై ట్రంప్ ఫైర్..
## జనరల్ కేన్‌పై ప్రశంసల జల్లు!


- "ఫేక్ న్యూస్‌పై ట్రంప్ ఫైర్..
- జనరల్ కేన్‌పై ప్రశంసల జల్లు!
- ఇరాన్ యుద్ధంపై వివాదం
- జనరల్ కేన్‌కు మద్దతు
- బి-2 స్పిరిట్ దాడుల ప్రస్తావన
- దౌత్య ఒప్పందమే ప్రాధాన్యం
- సైనిక చర్యపై హెచ్చరికలు



2 లో

## అన్‌లిస్టెడ్ కంపెనీల జాబితాలో
## రిలయన్స్ రిటైల్ అగ్రస్థానం

- ఫ్లిప్కార్ట్ రెండో స్థానం
- మలబార్ గోల్డ్ డైమండ్స్‌మూడో స్థానం
- 8.9 లక్షల కోట్ల ఆదాయం
- 28.5 లక్షల కోట్ల విలువ
- ఎలక్ట్రానిక్స్-ఈవీ రంగాల్లో వేగవంతమైన వృద్ధి




2 లో

# మోడీ సిగ్గుపడాల్సిన అంశాలు బోలెడున్నాయి

## రాహుల్ గాంధీ మాస్ ర్యాగింగ్

న్యూస్ డెస్క్, 24 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): ప్రధాని నరేంద్ర మోదీ లక్ష్యంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరోసారి నిప్పులు చెరిగారు. ప్రధాని తన ప్రసంగాల్లో 'సిగ్గుపడాల్సిన విషయం' గురించి మాట్లాడుతున్నారని, కానీ అసలు సిగ్గుపడాల్సిన అంశాలు తన వద్ద ఉన్నాయంటూ రాహుల్ గాంధీ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ట్విట్టర్ వేదికగా ట్వీట్ చేశారు. అంతర్జాతీయ నేరస్థుడు ఎప్‌స్టీన్ ఫైల్స్ లో ప్రధాని మోదీ, ఆయన మంత్రి, ఆయన సన్నిహితుల పేర్లు ఉండటంపై రాహుల్ తీవ్రంగా స్పందించారు. అంతటి దారుణమైన నేరస్థుడితో మోడీ పేరు ముడిపడి ఉండటం దేశానికే సిగ్గుచేటని మండిపడ్డారు. అమెరికాతో కుదుర్చుకున్న ట్రేడ్ డీల్స్ ద్వారా దేశ డేటాను తాకట్టు పెట్టారని, రైతులను, టెక్స్టైల్ పరిశ్రమను సర్వనాశనం చేశారని రాహుల్ ఆరోపించారు. అమెరికాతో చేసిన డీల్‌లో దేశ ప్రయోజనాలను అమ్మేశారని.. ఇది సిగ్గుపడాల్సిన విషయం కాదా అని ప్రశ్నించారు.

గౌతమ్ అదానీ పై అమెరికాలో నడుస్తున్న కేసు



2 లో

ప్రధాని మోదీ నిద్రను దూరం చేసిందని రాహుల్ కామెంట్ చేశారు.అదానీపై కేసు అంటే అది బీజేపీ ఆర్థిక వ్యవస్థపై పడిన కేసు అని, అందుకే 14 నెలలుగా దానిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ధ్వజమెత్తారు. 'మోదీ గారూ.. మీరు మీ మిత్రులైన అనిల్ అంబానీ, అదానీ కోసం మీకు నచ్చింది చేసుకోండి. కానీ నేను, కాంగ్రెస్ పార్టీకి చెందిన బబ్బర్ షేర్లు దేశ రక్షణ కోసం పోరాడుతూనే ఉంటాం. మేము ఒక్క ఇంచు కూడా వెనక్కి తగ్గం' అంటూ రాహుల్ గాంధీ ట్వీట్ చేశారు.

## 26/11 నిందితుడు తహావూర్ రాణాకు కెనడా షాక్

# పౌరసత్వం రద్దుకు రంగం సిద్ధం!



2 లో

న్యూస్ డెస్క్, 24 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): ముంబయి 26/11 ఉగ్రదాడి నిందితుడు తహావూర్ రాణాకు బిగ్ షాక్ తగలబోతున్నట్లు తెలుస్తోంది. తహావూర్ రాణా పౌరసత్వాన్ని రద్దు చేసే ప్రక్రియను కెనడా ప్రభుత్వం ప్రారంభించింది. ఎల్లుండి భారత పర్యటనకు కెనడా ప్రధాని మార్క్ కార్నీ రాబోతున్న వేళ ఈ పరిణామం ఆసక్తిగా మారింది. కెనడా మాజీ ప్రధాని జస్టిన్ ట్రూడో హయాంలో దెబ్బతిన్న భారత్-కెనడా సంబంధాలను పునరుద్ధరించేందుకు, ప్రస్తుత కెనడా ప్రధాని మార్క్ కార్నీ ఫిబ్రవరి 26న భారత్‌లో పర్యటించనున్నారు. ఈ పర్యటనకు ముందే కెనడా ఈ కీలక నిర్ణయం తీసుకోవడం గమనార్హం. పాకిస్థాన్‌లో జన్మించిన రాణా ప్రస్తుతం తిహార్ జైల్లో ఉన్నాడు. లష్కరే తోయిబా ఆధ్వర్యంలో జరిగిన ముంబై దాడుల కేసులో ఆయన విచారణను ఎదుర్కొంటున్నాడు.

KR TV మన క్రాంతి ఇది వాస్తవ పత్రిక...



# భూదాన భూముల్లో హై టెన్షన్

## తమ ఇళ్లను తొలగించొద్దంటూ బాధితుల వేడుకోలు

మొదటి పేజీ తరువాయి

గత పది సంవత్సరాలుగా ఇక్కడే ఎండ కి ఎండుతూ వానికి తడుస్తూ ఇక్కడే జీవనం గడుపుతున్నామని అలాంటి మా గుడిసెలను అక్రమంగా ఆర్మీ సైన్యం మోహరింపుతో గుడిసెలను తొలగించడం సరైనది కాదని వెంటనే తమకు ఇండ్లు నిర్మించి ప్రభుత్వం ఇవ్వాలని లేని ఎడల ఆందోళనలకు పూనుకుంటామని హెచ్చరించారు.

మీడియాకు అనుమతి ఇవ్వని పోలీసులు.. భూదాన భూముల్లో ఇండ్లను తొలగిస్తున్న వార్త కవరేజ్ కి వెళ్ళిన మీడియాను పోలీసులు అడ్డగించడంతో పోలీసులకు మీడియాకు కొంత ఘర్షణ వాతావరణం ఏర్పడింది. ఆక్రమణల తొలగింపు కవరేజ్ కి వచ్చిన మీడియాను ఎందుకు అనుమతి ఇవ్వడం లేదని మీడియా ప్రశ్నించడంతో పోలీసులు చాలాసేపటి వరకు వివాదం జరగడంతో అప్పుడు కొంత సడలింపు ఇవ్వడంతో మీడియా కవరేజ్‌కి వెళ్లడం జరిగింది. ప్రభుత్వం ఆక్రమణలను తొలగించాలంటూ స్టే ఇచ్చినట్లుగా అధికారులు చెబుతున్నప్పటికీ స్టే ఆర్డర్ ను ఎవరికి చూపించకపోవడం గమనార్హం. ప్రభుత్వం మొండి వైఖరి అధికారుల నిర్లక్ష్యం కారణంగా 200 మంది రోడ్డున పడాల్సి వస్తుంది, ఇటీవల చీఫ్ జస్టిస్ చంద్రకుమార్ ఖమ్మం వచ్చి భూదాన భూమి ఆవరణలో నివసిస్తున్న పేదలను పరిశీలించి అక్కడ భూమి జోలికి ఎవరు వెళ్లొద్దంటూ కలెక్టర్‌కు సైతం ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. భూదాన భూమిలో ఇళ్లను తొలగించడంతో స్థానికులు కన్నీరు మున్నీరై ఇంట్లో సామాన్లు సర్దుకుని రోడ్లపైనే వర్షానికి తడుస్తూ నిలబడి కన్నీరు మున్నేరు కారుస్తున్నారు.

# కోఠి కాల్పుల కేసు ఛేదనం నిందితులందరూ అరెస్ట్

న్యూస్ డెస్క్, 24 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): హైదరాబాద్‌లో అత్యంత రద్దీ ప్రాంతమైన కోఠి ఎస్‌బీఐ ఏటీఎం వద్ద కేరళ వ్యాపారిపై కాల్పులు జరిపి నగదు దోచుకున్న కేసును తెలంగాణ పోలీసులు ఛేదించారు. తాజాగా నిందుతులందరినీ టాస్క్‌ఫోర్స్ టీమ్ అదుపులోకి తీసుకుంది. ఈ మేరకు నిందితుల నుంచి ఓ వెపన్ కూడా రికవరీ చేశారు. ఫిబ్రవరి 16న కేసులో ప్రధాన నిందితుల్లో ఒకరిని ఇప్పటికే టాస్క్‌ఫోర్స్ పోలీసులు హర్యానా లో చాకచక్యంగా పట్టుకున్నారు. అతడు ఇచ్చిన ప్రాథమిక సమాచారం మేరకు పరారీలో ఉన్న మరో నిందితుడి కోసం ఉత్తరప్రదేశ్‌లో గాలించగా అతడిని మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. దీంతో కేసులో నిందితులంతా పట్టుబడినట్లైంది. ఈ మేరకు వారిని మంగళవారం మీడియా ముందు ప్రవేశపెట్టే అవకాశం ఉంది.

కాగా, కేరళకు చెందిన వస్త్ర వ్యాపారి రిన్షద్, వ్యాపార నిమిత్తం హైదరాబాద్‌కు వచ్చి నాంపల్లి లో ఉంటున్నారు. జనవరి 31న ఉదయం సుమారు 7 గంటల సమయంలో కోఠిలోని ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ ఏటీఎం వద్ద రూ.6 లక్షల నగదు డిపాజిట్ చేసేందుకు వెళ్లగా, దుండగులు అతడిపై 2 రౌండ్లు కాల్పులు జరిపారు. బుల్లెట్ కాలికి తగలడంతో గాయపడిన రిన్షద్ నుంచి నగదు బ్యాగును, ఆయన స్కూటీని లాక్కొని నిందితులు పరారయ్యారు. అయితే, ఈ ముఠాకు హైదరాబాద్‌లో ఆశ్రయం కల్పించి, దోపిడీకి సహకరించిన పాతబస్తీకి చెందిన ఒక వ్యక్తిని పోలీసులు ఇప్పటికే అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే.

## మంచు తుఫానుతో అమెరికా అతలాకుతలం.. 10,000 విమానాలు రద్దు, స్తంభించిన జనజీవనం

న్యూస్ డెస్క్, 24 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): అగ్రరాజ్యం అమెరికాలో మంచు తుఫాను అతలాకుతలం చేస్తుంది. రెండు వారాల కిందట బీభత్సం సృష్టించగా.. ఆ భయానక పరిస్థుల నుంచి కోలుకోక ముందే మరోసారి మంచు తుఫాను విరుచుకుపడింది. ముఖ్యంగా అమెరికా ఈశాన్య రాష్ట్రాలపై మంచు తుఫాను 'బాంబ్ సైక్లోన్' రూపంలో విరుచుకుపడుతోంది. న్యూయార్క్, బోస్టన్, మసాచుసెట్స్, రోడ్ ఐలాండ్ వంటి ప్రాంతాల్లో భారీ హిమపాతం నమోదైంది. ముఖ్యంగా రోడ్ ఐలాండ్‌లో దాదాపు 3 అడుగుల మేర మంచు కురిసి గత దశాబ్దాల రికార్డులను తిరగరాసింది. గంటకు 70 మైళ్ల వేగంతో వీస్తున్న బలమైన గాలుల కారణంగా రహదారులపై ఏమీ కనిపించని పరిస్థితులు ఏర్పడటంతో అధికారులు అత్యవసర పరిస్థితిని ప్రకటించారు.

ఈ ప్రకృతి వైపరీత్యం రవాణా వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపింది. భద్రతా కారణాల దృష్ట్యా శనివారం నుంచి మంగళవారం వరకు దాదాపు 10,000 విమాన సర్వీసులను విమానయాన సంస్థలు రద్దు చేశాయి. న్యూయార్క్, బోస్టన్ వంటి ప్రధాన నగరాల్లో రహదారులపై వాహనాల రాకపోకలపై అధికారులు కఠిన నిషేధం విధించారు. ఆమ్ట్రాక్ రైలు సర్వీసులు కూడా నిలిచిపోవడంతో వేలాది మంది ప్రయాణికులు విమానాశ్రయాలు, రైల్వే స్టేషన్లలోనే చిక్కుకుపోయారు.

తుఫాను ధాటికి విద్యుత్ లైన్లు తెగిపోవడంతో సుమారు 6 లక్షల ఇళ్లు, వ్యాపార సముదాయాలు అంధకారంలో మునిగిపోయాయి. ఉష్ణోగ్రతలు కనిష్ట స్థాయికి పడిపోవడంతో ప్రజలు ఇళ్లకే పరిమితం కావాలని ప్రభుత్వం హెచ్చరించింది. విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలకు ఇప్పటికే సెలవు ప్రకటించగా, మంచును తొలగించే పనులు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయి. పరిస్థితులు చక్క బడటానికి మరో రెండు రోజులు పట్టవచ్చని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది.

# బార్పేటా రోడ్‌లో సినిమా తరహా దోపిడీ



న్యూస్ డెస్క్, 24 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): ఇటీవల దేశవ్యాప్తంగా జరుగుతున్న దొంగతనాలు సినిమాలకు ఏ మాత్రం తగ్గకుండా పోలీసులతో పాటు ప్రజలను ఆశ్చర్యానికి గురి చేస్తున్నాయి. ఈ క్రమంలోనే పట్టపగలే అత్యంత సాహసోపేతంగా దోపిడీ జరిగింది. అస్సాంలోని బార్పేటా రోడ్ పట్టణంలో దుర్గాబారి రోడ్‌లోని 'సెన్కో అలంకార్' జ్యువెలరీ షోరూమ్‌లోకి కస్టమర్ల ముసుగులో ప్రవేశించిన ఐదుగురు దుండగులు, తుపాకులతో సిబ్బందిని హడలెత్తించారు. ఐదుగురు మహిళా ఉద్యోగులతో సహా ఎనిమిది మంది సిబ్బంది చేతులు, కాళ్లు కట్టేసి, నోళ్లకు టేపులు వేసి ఒక గదిలో బంధించారు.

సినిమా సీన్లను తలపించేలా సాగిన ఈ దోపిడీలో దుండగులు సాక్ష్యాలు దొరకకుండా సీసీటీవీ హార్డ్ డిస్క్‌లను కూడా ఎత్తుకెళ్లారు. మూడు రోజుల క్రితం ఈ ఘటన చోటు చేసుకోగా.. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఆ వీడియోలో దుండగులు జ్యువెలరీ సిబ్బందిని బందించడం స్పష్టంగా కనిపించింది.

ఈ దోపిడీలో సుమారు 12 కోట్ల రూపాయల విలువైన బంగారు, వజ్రాల ఆభరణాలు, నగదును దోచుకెళ్లినట్లు షోరూమ్ యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేవలం అరగంట వ్యవధిలోనే పని ముగించుకున్న దుండగులు, వెళ్లేటప్పుడు షోరూమ్ షట్టర్లను బయట నుంచి లాక్ చేసి పరారయ్యారు. స్థానిక వ్యాపారస్తులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఈ దారుణం వెలుగులోకి వచ్చింది. పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలోనే ఇంత పెద్ద దోపిడీ జరగడం స్థానికంగా కలకలం రేపింది.

కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు. గోల్పారా జిల్లాలో జరిపిన ఆపరేషన్‌లో నలుగురు అనుమానితులను ఇప్పటికే అరెస్టు చేసినట్లు సమాచారం. పరారీలో ఉన్న మరో నిందితుడి కోసం పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు. దోచుకున్న ఆభరణాలను రికవరీ చేసేందుకు దర్యాప్తును వేగవంతం చేసినట్లు తెలుస్తుంది.

# బంగ్లాలో ఆర్మీలో భారీ మార్పులు.. ఇండియాలోని అధికారికి ప్రమోషన్!

న్యూస్ డెస్క్, 24 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): బంగ్లాదేశ్ లో సమూల మార్పులు జరుగుతున్నాయి. కొత్త ప్రభుత్వం ఏర్పాటు కాగానే, ఈ పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఇక లేటెస్ట్ గా బంగ్లాదేశ్ ఆర్మీలో కూడా భారీ మార్పులు జరిగినట్లు వార్తలు వస్తున్నాయి. బంగ్లాదేశ్ కొత్త ప్రధానిగా తారిక్ రహమాన్ తాజాగా బాధ్యతలు చేపట్టారు. ఈ నేపథ్యంలోనే ఆయన బంగ్లాదేశ్ సైన్యంలో కీలక మార్పులు చేసినట్లు తెలుస్తోంది.

ముఖ్యంగా ఇండియాలోని అధికారికి ప్రమోషన్ ఇచ్చిందట. బంగ్లాదేశ్ డిఫెన్స్ అడ్వైజర్ గా ఉన్న మహమ్మద్ హఫీజుర్ రెహమాన్ ను వెనక్కి పిలిపించి, కీలక పదవి కట్టబెట్టారు. ఆయనకు బంగ్లాదేశ్ మేజర్ జనరల్ గా ప్రమోషన్ కూడా ఇచ్చారు కొత్త ప్రధాని తారిక్. కొత్త సీజీఎస్ తో పాటు మిలిటరీ ఇంటలిజెన్స్ కు కూడా కొత్త అధికారులను తారిక్ రహమాన్ నియామకం చేశారట. కొత్తగా ఏర్పడ్డ బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ ప్రభుత్వం తన పట్టు పెంచుకునే దిశగా ఈ నిర్ణయాలు తీసుకుంటుందని అంటున్నారు. ఇది ఇలా ఉండగా 23 శాతం సీట్లు సాధించిన బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ అధికారంలోకి వచ్చింది. 17 ఏళ్ల తర్వాత పీఠం దక్కించుకుంది.

## ఎయిర్ అంబులెన్స్ కూలిన ఘటనలో ఏడుగురు మృతి

న్యూస్ డెస్క్, 24 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): జార్ఖండ్‌లోని ఛాత్రా జిల్లాలో కూలిన ఎయిర్ అంబులెన్స్ ఘటనలో ఏడుగురు మృతిచెందినట్లు అధికారులు ధ్రువీకరించారు. విమానంలో ఉన్న ఏడుగురు మృతిచెందారని, ఆ విమానం రాంచీ నుంచి ఢిల్లీ వెళ్తున్నట్లు ఛాత్రా డిప్యూటీ కమీషనర్ కీర్తిశ్రీ తెలిపారు. సిమరియా వద్ద ఈ ప్రమాదం జరిగింది. మృతుల భౌతికకాయాలను పోస్టు మార్టమ్ నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు. బీచ్‌క్రాఫ్ట్ సీ90 ఎయిర్ అంబులెన్స్‌ను రెడ్‌బర్డ్ ఎయిర్‌వేస్ సంస్థ ఆపరేట్ చేస్తున్నది. అటవీ ప్రాంతంలో ఎయిర్ అంబులెన్స్ కూలిందని, ఇద్దరు పైలెట్లతో సహా ఏడు మంది మరణించినట్లు అధికారులు పేర్కొన్నారు. ఛాత్రాలోని సదర్ ఆస్పత్రిలో పోస్టు మార్టమ్ చేస్తున్నారు. ప్రమాద ఘటన పట్ల దర్యాప్తు మొదలుపెట్టారు.

రాంచీ విమానాశ్రయం నుంచి 7.11 నిమిషాలకు విమానం టేకాఫ్ తీసుకున్నది. 7.30 నిమిషాలకు ఏటీసీతో కాంటాక్ట్ తెగిపోయింది. అయితే బహుశా మేఘావృతమైన వాతావరణం వల్ల ప్రమాదం జరిగి ఉంటుందని రాంచీ విమానాశ్రయ డైరెక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. కానీ ఇంత వరకు అధికారికంగా ఎటువంటి కారణం చెప్పలేదు. మృతుల్లో కెప్టెన్ వివేక్ వికాశ్ భగత్, కెప్టెన్ స్వరాజ్‌దీప్ సింగ్, సంజయ్ కుమార్, డాక్టర్ వికాశ్ కుమార్ గుప్తా, సచిన్ కుమార్ మిశ్రా, అర్చనా దేవి, దురుకుమార్ ఉన్నారు. వారణాసికి ఆగ్నేయంగా 100 నాటికల్ మైళ్ల దూరంలో ఉన్నప్పుడు కోల్‌కతాలోని ఏటీసీతో ఆ ఎయిర్ అంబులెన్స్ కమ్యూనికేషన్ తెగిపోయినట్లు తెలిసింది. ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో బృందం ప్రమాద స్థలానికి చేరుకున్నది.

# ఇన్ఫోసిస్‌లో రూ. 17 లక్షల ప్యాకేజీ.. బీటెక్ ఫైనల్ ఇయర్ విద్యార్థి సూసైడ్

న్యూస్ డెస్క్, 24 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): : తిరుపతిలో దారుణం చోటు చేసుకుంది. మోహన్ బాబు యూనివర్సిటీలో చదువుతున్న విద్యార్థిని ఆత్మహత్య అందరినీ కలచివేస్తోంది. కలల ప్రయాణం కావాల్సిన మా అమ్మాయి జీవితం ఇలా కన్నీటి కథగా మారిపోయిందని కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతం అవుతున్నారు. ఎంబీయూలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్న భువన చదువులో ఎప్పుడూ ముందుండే విద్యార్థిని, క్లాస్ టాపర్. ఇటీవల రాసిన పరీక్షల్లో 96 శాతం మార్కులు సాధించి కుటుంబానికి గర్వకారణంగా నిలిచింది.

అయితే, క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో రూ.17 లక్షల ప్యాకేజీతో ఇన్ఫోసిస్ లో ఉద్యోగం కూడా సాధించింది. అంతా బాగానే ఉందనుకున్న సమయంలో ఒక్కసారిగా ఆమె జీవితం ఆగిపోయింది. ఎవరు ఊహించని విధంగా గత రాత్రి యూనివర్సిటీ సమీపంలోని ప్రైవేట్ హాస్టల్ గదిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకోవడం కుటుంబాన్ని, స్నేహితులను షాక్‌కు గురి చేసింది. ఆశలు, ఆశయాలు నిండిన ఆ యువతి నిన్న చివరి సారిగా తల్లిదండ్రులకు ఫోన్ చేసి "మన సమస్యలు తీరిపోతాయి" అని చెప్పింది.

ఇక, ఆ మాటలే ఇప్పుడు భువన తల్లిదండ్రుల హృదయాలను ముక్కలు చేస్తున్నాయి. రుయా మార్చురీ దగ్గర "మా అమ్మాయి ఎందుకు ఇలా చేసిందో అర్థం కావడం లేదు" అంటూ కన్నీటి పర్యంతం అవుతున్నారు. విద్యార్థిని మృతిపై నిజాలు నిగ్గు తేల్చాలంటూ రుయా ఆసుపత్రి వద్ద విద్యార్థి సంఘాలు ఆందోళనకు దిగాయి.

## "ఫేక్ న్యూస్‌పై ట్రంప్ ఫైర్.. జనరల్ కేన్‌పై ప్రశంసల జల్లు!

న్యూస్ డెస్క్, 24 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): ఇరాన్‌తో యుద్ధం విషయంలో అమెరికా సైనిక నాయకత్వంతో ట్రంప్ కు విభేదాలు ఉన్నాయని అనేక వార్తలు వచ్చాయి. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ద్వారా ప్రచారం అవుతున్న తప్పుడు వార్తలను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా ఖండించారు. ముఖ్యంగా జనరల్ డేనియల్ కేన్ (జనరల్ రజిన్) ఇరాన్‌పై సైనిక చర్యను వ్యతిరేకిస్తున్నారని మీడియాలో వస్తున్న కథనాలు 100 శాతం అబద్ధమని ఆయన స్పష్టం చేశారు. ఎవరికైనా యుద్ధం ఇష్టం ఉండదని, అయితే ఒకవేళ సైనిక చర్య చేపట్టాల్సి వస్తే దానిని సులభంగా గెలవవచ్చని జనరల్ కేన్ అభిప్రాయపడినట్లు ట్రంప్ పేర్కొన్నారు. జనరల్ కేన్ సామర్థ్యాన్ని కొనియాడుతూ, గతంలో ఇరాన్ అణు కేంద్రాలపై జరిగిన 'ఆపరేషన్ మిడ్‌నైట్ హామర్' కు ఆయనే నాయకత్వం వహించారని ట్రంప్ గుర్తుచేశారు. అమెరికాకు చెందిన శక్తివంతమైన బి-2 బాంబర్లు ఆ అణు కేంద్రాలను పూర్తిగా ధ్వంసం చేశాయని, అటువంటి గొప్ప పోరాట యోధుడు దేశం కోసం ఏ క్షణమైనా నాయకత్వం వహించడానికి సిద్ధంగా ఉన్నారని ఆయన వివరించారు. ఇరాన్‌తో పరిమిత దాడులు, యుద్ధం చేయకూడదనే ఉద్దేశ్యం జనరల్ కేన్‌కు లేదని, ఆయనకు కేవలం గెలవడం మాత్రమే తెలుసని ట్రంప్ ధీమా వ్యక్తం చేశారు. అంతిమంగా యుద్ధం-దౌత్యపరమైన ఒప్పందంపై నిర్ణయం తీసుకునే అధికారం తనకే ఉందని ట్రంప్ స్పష్టం చేశారు. తనకు ఇరాన్‌తో చర్చల ద్వారా ఒప్పందం కుదుర్చుకోవడమే ఇష్టమని, కానీ ఒకవేళ అది సాధ్యం కాకపోతే ఇరాన్ దేశానికి అది చాలా దారుణమైన రోజు అవుతుందని ట్రంప్ హెచ్చరించారు. ఇరాన్ ప్రజలు చాలా గొప్పవారని, వారు ఇటువంటి విపత్కర పరిస్థితులను ఎదుర్కోవాల్సి రావడం విచారకరమని పేర్కొంటూనే, అమెరికా సైనిక శక్తి గురించి ఆయన పరోక్షంగా హెచ్చరికలు జారీ చేశారు.

## అన్‌లిస్టెడ్ కంపెనీల జాబితాలో రిలయన్స్ రిటైల్ అగ్రస్థానం

న్యూస్ డెస్క్, 24 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): దేశీయ స్టాక్ మార్కెట్లో లిస్ట్ కాకుండా ఉన్న కంపెనీల్లో రిలయన్స్ రిటైల్ సంస్థ భారీ ఆదాయంతో అగ్రస్థానం సొంతం చేసుకుంది. మంగళవారం జేఎమ్ ఫైనాన్షియల్, హురున్ ఇండియా విడుదల చేసిన అన్‌లిస్టెడ్ జెమ్స్-2026 జాబితాలో రిలయన్స్ రిటైల్ రూ. 2.7 లక్షల కోట్ల భారీ ఆదాయంతో దేశంలోనే అతిపెద్ద అన్‌లిస్టెడ్ కంపెనీగా అగ్రస్థానంలో నిలిచింది. దీని తర్వాత రూ. 83,105 కోట్ల ఆదాయంతో ఈ-కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్ రెండో స్థానం దక్కించుకుంది. ఈ జాబితాలో దేశంలోని 100 పెద్ద అన్‌లిస్టెడ్ కంపెనీలు ఉన్నాయి, ఇవి ఒక్కొక్కటి కనీసం రూ. 1,000 కోట్ల ఆదాయాన్ని ఆర్జిస్తున్నాయి. జేఎమ్ ఫైనాన్షియల్, హురున్ ఇండియా నివేదిక ప్రకారం, రూ. 66,000 కోట్లతో మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ మూడో స్థానంలో ఉంది. ఈ వంద కంపెనీలు సంయుక్తంగా 2025లో రూ. 8.9 లక్షల కోట్ల ఆదాయాన్ని ఆర్జించాయి. ఈ కంపెనీలన్నిటి విలువ రూ. 28.5 లక్షల కోట్లు. ఇవి దాదాపు 12 లక్షల మందికి ఉపాధిని కల్పిస్తున్నాయి. దేశంలో అన్‌లిస్టెడ్ కంపెనీలు అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్నాయని, దేశ ఆర్థికవ్యవస్థలో బలమైన విభాగంగా మారాయని ఈ గణాంకాలు సూచిస్తున్నాయని, వీటిలో చాలావరకు భవిష్యత్తులో ఐపీఓలుగా వస్తాయని నివేదిక తెలిపింది. ఈ జాబితాలో కొన్ని కంపెనీలు చాలా వేగంగా అభివృద్ధి చెందాయి. టాటా ఎలక్ట్రానిక్స్ 3,173 శాతంతో రికార్డు స్థాయి వృద్ధి రేటును నమోదు చేయగా, టాటా ప్యాసింజర్ ఎలక్ట్రిక్ మొబిలిటీ 904 శాతం, జేఎస్‌డబ్ల్యూ వన్ ప్లాట్‌ఫామ్‌లు 522 శాతం వృద్ధి చూశాయి. ఈ వృద్ధి ఎలక్ట్రానిక్స్ తయారీ, ఎలక్ట్రిక్ వాహనాలు, డిజిటల్ బీ2బీ ప్లాట్‌ఫామ్ వంటి రంగాలలో పెరుగుతున్న డిమాండ్‌ను చూపిస్తుందని నివేదిక పేర్కొంది.

# దేవాదుల సాక్షిగా పరిష్కారం సీఎం రేవంత్ రెడ్డి సెన్సేషనల్ ట్వీట్

మొదటి పేజీ తరువాయి

రాజీలేని పోరాటం చేస్తాం.. సీఎం రేవంత్

ఇటీవల దేవాదుల ప్రాజెక్టు సందర్శన సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. కృష్ణా, గోదావరి నదుల నీటి వాటా విషయంలో రాష్ట్రాల మధ్య తలెత్తే అభిప్రాయ భేదాలను పంచాయితీల ద్వారా కాకుండా, స్నేహపూర్వక వాతావరణంలో పరిష్కరించుకుంటామని అన్నారు. జలాల సాధనలో రాజీలేని పోరాటం చేస్తూనే, సామరస్యానికి పెద్దపీట వేస్తామని స్పష్టం చేశారు.

రెండు రాష్ట్రాల మధ్య జల వివాదాలు ఇలా..

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల మధ్య జల వివాదాలు ప్రధానంగా కృష్ణా, గోదావరి నదీ జలాల పంపిణీ చుట్టూనే తిరుగుతున్నాయి. విభజన చట్టం ప్రకారం తాత్కాలికంగా ఆంధ్రప్రదేశ్‌కు 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీలను కేటాయించారు. అయితే, తమకు సమాన వాటా కావాలని తెలంగాణ మొదటి నుంచీ డిమాండ్ చేస్తోంది. కృష్ణా జలాల వివాదాల పరిష్కారానికి బ్రిజేష్ కుమార్ నేతృత్వంలోని ట్రైబ్యునల్ విచారణ చేపట్టింది. ఈ క్రమంలో ప్రాజెక్టుల వారీగా కేటాయింపులు చేయాలని తెలంగాణ కోరుతోంది. ఇక శ్రీశైలం, నాగార్జున సాగర్ డ్యామ్‌ల నిర్వహణ ఎవరి పరిధిలోకి రావాలనే దానిపై తరచుగా ఘర్షణలు జరుగుతున్నాయి. ఇటీవల కేంద్రం వీటిని కెఆర్ఎంబి పరిధిలోకి తీసుకురావాలని ఆదేశించింది.

అదేవిధంగా గోదావరిలో నీటి లభ్యత ఎక్కువగా ఉన్నప్పటికీ, ప్రాజెక్టుల నిర్మాణంపై అభ్యంతరాలు ఉన్నాయి. తెలంగాణ నిర్మిస్తున్న కాళేశ్వరం వంటి ప్రాజెక్టుల వల్ల తమకు వచ్చే నీటి ప్రవాహం తగ్గుతుందని ఏపీ, అలాగే ఏపీ చేపట్టిన పోలవరం ఎత్తు, ముంపు ప్రభావంపై తెలంగాణ ఇలా పరస్పరం అభ్యంతరాలు లేవనెత్తుతున్నాయి. తాజాగా, ఏపీ ప్రభుత్వం తలపెట్టిన పోలవరం-నల్లమల సాగర్ ప్రాజెక్టుపై కూడా తెలంగాణ ప్రభుత్వం కేంద్ర జలశక్తికి ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. తాజాగా, రెండు రాష్ట్రాల మధ్య జల వివాదాలపై సీఎం రేవంత్ రెడ్డి చేసిన ట్వీట్‌కు ఏపీ ప్రభుత్వం స్పందిస్తుందో లేదో వేచి చూడాల్సిందే మరి.

## 26/11 నిందితుడు తహవూర్ రాణాకు కెనడా షాక్.. పౌరసత్వం రద్దుకు రంగం సిద్ధం!

మొదటి పేజీ తరువాయి

పౌరసత్వ రద్దుకు కారణం ఇదే: కెనడా పౌరసత్వం కలిగి ఉన్న తహవూర్ రాణా పౌరసత్వాన్ని రద్దు చేయాలన్న కెనడా నిర్ణయం వెనుక ఉగ్రవాద ఆరోపణలు కాదని తెలుస్తోంది. కెనడా ఇమ్మిగ్రేషన్ విభాగం (ఐఆర్సీసీ) ప్రకారం ఆయన 2001లో కెనడా పౌరసత్వం పొందే సమయంలో తప్పుడు వివరాలు సమర్పించారనే ఆరోపణలతో ఈ చర్యలు తీసుకోబోతోంది. పౌరసత్వం కోసం సమర్పించిన దరఖాస్తులో తాను కెనడాలో నాలుగేళ్లపాటు నివసించానని, ఆ సమయంలో కేవలం ఆరు రోజులు మాత్రమే దేశం వెలుపల ఉన్నానని కెనడా అధికారులకు రాణా వెల్లడించారు. కానీ రాయల్ కెనడీ మౌంటెడ్ పోలీసుల దర్యాప్తులో రాణా ఆ సమయంలో ఎక్కువ భాగం అమెరికాలోని షికాగాలో గడిపినట్లు తేలింది. అక్కడ ఆయనకు సొంత ఆస్తులు మరియు వ్యాపారాలు (ఇమ్మిగ్రేషన్ కన్సల్టెన్సీ, గ్రోసరీ స్టోర్) ఉన్నట్లు గుర్తించారు. ఇది తీవ్రమైన మరియు ఉద్దేశపూర్వక మోసంగా కెనడా ప్రభుత్వం ఆయన పౌరసత్వాన్ని రద్దు చేయాలని నిర్ణయించినట్లు ఈ కథనం పేర్కొంది.


గతేడాది భారత్‌కు అప్పగింత: 26/11 ఎటాక్ లో కీలక సూత్రధారిగా ఉన్న తహవూర్ రాణాను గతేడాది అమెరికా భారత్?కు అప్పగించింది. రాణాను తమకు అప్పగించాలంటూ భారత్ చాలా కాలంగా న్యాయపోరాటం చేసింది. అయితే భారత ప్రయత్నాలను సవాలు చేస్తూ అతడు పలు ఫెడరల్ కోర్టులతో పాటు శాన్‌ఫ్రాన్సిస్కోలోని యూఎస్ కోర్టును సైతం ఆశ్రయించాడు. ఆయా న్యాయస్థానాల్లో అతడికి చుక్కెదురైంది. ఈక్రమంలో అమెరికా సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ వేయగా అక్కడా నిరాశే ఎదురైంది. అక్కడ అతడికి ఉన్న చట్టపరమైన అవకాశాలన్నీ ముగిసిపోవడంతో గతేడాది అతడిని ఎన్ఐఏ అధికారులు భారత్ కు తీసుకువచ్చి విచారిస్తున్నారు.

# ఘోర అగ్నిప్రమాదం.. ఒకే ఇంట్లో ఆరుగురు సజీవదహనం

న్యూస్ డెస్క్, 24 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): ఓ ఇంట్లో అగ్నిప్రమాదం చోటు చేసుకొని ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. ఈ షాకింగ్ ఘటన ఉత్తరప్రదేశ్‌లోని మీరట్ జిల్లాలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. లిసాడి గేట్ ప్రాంతంలోని ఇక్బాల్ అహ్మద్ అనే వ్యక్తి నివాసంలో రాత్రి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. క్షణాల్లోనే మంటలు ఇంటికి మొత్తం వ్యాపించడంతో ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో మహిళలు, చిన్న పిల్లలు కూడా ఉండటం స్థానికులను కలచివేసింది. రాత్రి 8:49 గంటల సమయంలో అగ్ని ప్రమాదం జరిగినట్లు సమాచారం అందగానే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కుటుంబ సభ్యులను వెంటనే సివిల్ ఆసుపత్రికి తరలించారు. అయితే, అప్పటికే ఆరుగురు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మంటలు వేగంగా వ్యాపించడంతో వారు బయటకు రాలేకపోయారని పోలీసులు వెల్లడించారు. ఎస్పీ అవినాష్ పాండే ఆసుపత్రిని సందర్శించి బాధితుల వివరాలను ఆరా తీశారు. ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని ప్రాథమికంగా భావిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటనతో లిసాడి గేట్ ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు అధికారులు తెలిపారు.

## మూసీ నది ఒడ్డున గాంధీ విగ్రహ ఏర్పాటు తుషార్ గాంధీ ట్వీట్ వైరల్




న్యూస్ డెస్క్, 24 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): మూసీ పునరుజ్జీవన పథకం లో భాగంగా తెలంగాణ ప్రభుత్వం 'గాంధీ సరోవర్' ప్రాజెక్టు కోసం వడివడిగా భూసేకరణ ప్రక్రియను చేపడుతున్నది. ఇప్పటికే భూసేకరణ నోటిఫికేషన్‌ను కూడా జారీ చేసి, అభిప్రాయ సేకరణ కోసం సమావేశాలను కూడా నిర్వహించింది. ఈ క్రమంలోనే భూసేకరణలో భాగంగా బండ్లగూడ జాగీర్ పరిధిలోని మధు పార్క్ రిడ్జ్ నిర్వాసితులు ఆందోళనకు దిగారు. దేశంలోనే అతిపెద్ద గాంధీ విగ్రహం ఏమో కానీ.. తాము చెట్టుకొకరు, పుట్టకొకరులా విడిపోయే పరిస్థితి వచ్చిందని పెద్దల నుంచి చిన్న పిల్లల వరకు సోషల్ మీడియా వేదికగా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సీఎం, సీఎంవోకు ట్యాగ్ చేస్తూ తుషార్ గాంధీ ట్వీట్..అయితే, 'గాంధీ సరోవర్' ప్రాజెక్టును ఉద్దేశించి గాంధీ మునిమనవడు తుషార్ గాంధీ సీఎం రేవంత్ రెడ్డితో పాటు, సీఎంవోను ట్యాగ్ చేస్తూ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ట్విట్టర్ వేదికగా చేసిన ట్వీట్ ప్రస్తుతం విపరీతంగా వైరల్ అవుతోంది. గాంధీ విగ్రహ ఏర్పాటు కోసం ప్రజలను వారి నివాసాల నుంచి వెళ్లగొట్టడం అస్సలు సరికాదని అన్నారు. బాపు బతికి ఉంటే 'నా పేరు మీద ఇలాంటివి చేయొద్దు, వెంటనే ఆపండి' అని చెప్పేవారని పేర్కొన్నారు. విగ్రహాల కంటే ప్రజల కనీస అవసరాలే ముఖ్యమని గాంధీజీ నమ్మేవారని, అటువంటిది ఆయన విగ్రహం కోసమే పేదల ఇళ్లను తొలగించడం ఆయన సిద్ధాంతాలకు విరుద్ధం' అని తుషార్ గాంధీ ట్వీట్ చేశారు. ఇక తుషార్ గాంధీ చేసిన ట్వీట్‌కు నెటిజన్లు కూడా స్పందించారు. మానవతా దృక్పథంతో ఈ నిర్ణయాన్ని పునరాలోచించాలని కోరుతున్నారు. అభివృద్ధి, విగ్రహాల పేరుతో నిరుపేదలను ఇబ్బందులకు గురిచేయడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదనే మరికొందరు కామెంట్ చేస్తున్నారు.

క్రాంతి తెలంగాణ

epaper.krtvnews.com

# భూ వివాదం వికటించింది ప్రాణాపాయ స్థితిలో వెంకటమ్మ!



మోత్కూర్, 24 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): భూతగాదాలో మహిళను దారి కాచి గొంతు కోసిన సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలంలోని పాలడుగు గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బొంత నరసింహ అతని తమ్ముడు అశోక్‌కు కొంతకాలంగా భూతగాధ నడుస్తుంది. గత సంవత్సరం నరసింహ అనారోగ్యం మరణించాడు. నరసింహ పేరిట ఉన్న భూమిలో తనకు వాటా వస్తుందని వివాదం కోర్టుల వరకు వెళ్లినట్లు సమాచారం. మంగళవారం ఉదయం నరసింహ భార్య వెంకటలక్ష్మి అలియాస్ వెంకటమ్మ పొలంలో ముగ్గురు మనుషుల సహాయంతో యూరియా చల్లించడానికి వెళ్ళింది. పని పూర్తి అయిన అనంతరం ఇంటికి చేరుకోవాలని వెంకటలక్ష్మి వస్తుండగా.. ఇదే అదనుగా భావించి ఆమె మరిది బొంత అశోక్ మరో ఇద్దరితో కలిసి మార్గమధ్యంలో సోలిపురం రామిరెడ్డి బావి సమీపంలో ఆమెపై హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ క్రమంలో మహిళ గొంతు తెగి తీవ్ర రక్తస్రావం జరిగినట్లు సమాచారం. వందకు(100) సమాచారం ఇవ్వగా.. చికిత్స కోసం ఆమెను అంబులెన్స్‌లో భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు ప్రత్యక్ష సాక్షుల సమాచారం. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు సంఘటనస్థలికి వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# హమాలి కార్మికులకు వెంటనే వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి-దాసరి పాండు డిమాండ్



మోత్కూర్, 24 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): ప్రభుత్వం హమాలి కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని ఆల్ అమాలి వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి పాండు అన్నారు. మంగళవారం మోత్కూరు మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న కార్మికులను హామాలీ సంఘం కార్మికుల సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే ముందు అసంఘటిత రంగంలో పనిచేస్తున్న హామాలి అసంఘటిత రంగ అన్ని రంగాల కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేస్తామని సమగ్రమైన చట్టం తీసుకొస్తామని పెరుగుతున్న ధరలకు అనుకూలంగా అనుకూలంగా రేట్లు చెల్లిస్తామని సౌకర్యాలు కల్పిస్తామని చెప్పిన ప్రభుత్వం నేటికీ అమలు చేయలేదని ఏళ్ల తరబడిగా గ్రామాలలో రైస్ మిల్లు మార్కెట్ హమాలి బజార్ హమాలి ఐకెపి గ్రామీణ హమాలి వివిధ రకాలుగా హమాలి కార్మికులుగా పనిచేస్తున్నారని ప్రభుత్వాలు హమాలి కార్మికులతో ప్రత్యక్షంగా పరోక్షంగా ఆదాయాన్ని సమకూస్తూ హమాలి కార్మికుల పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని వెంటనే హమాలి కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి కార్మికుల సంక్షేమానికి తోడ్పడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రమేష్ యాదగిరి బక్కులు ముత్తయ్య పరమేష్ సోమయ్య పరమేష్ ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

# క్షయ అంతం మనందరి పంతం



నర్సింహులపేట, 24 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): మండల కేంద్రంలోని ఆరోగ్య ఉపకేంద్రంలో క్షయ లక్షణాలు ఉన్న అనుమానితుల నుంచి తెమడ నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం తొర్రూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపించినట్లు టీబీ నోడల్ సూపర్వైజర్ చలపతి తెలిపారు. రెండు వారాలకు పైగా దగ్గు, జ్వరం, బరువు తగ్గడం, రాత్రిపూట చెమటలు పట్టడం వంటి లక్షణాలు ఉన్నవారు తప్పనిసరిగా తెమడ పరీక్ష చేయించుకోవాలని సూచించారు. క్షయ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ సంజీవరావు, భీమా నాయక్, ఎంఎల్ హెచ్ పి అన్వేష్, ఏఎన్ఎం ప్రసన్న కుమారి, ఆశా కార్యకర్తలు వెంకటలక్ష్మి, సరస్వతి, లక్ష్మి, గణిత తదితరులు పాల్గొన్నారు.

# కాలనీ సమస్యలపై ఎంపీఈటల ని కలసిన సూరారం 60 గజాల కాలనీవాసులు



కుత్బుల్లాపూర్, 24 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): భారతీయ జనతా పార్టీ రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యులు యం ఎస్ వాసు ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ సూరారం 60 గజాల కాలనీలో గత ఇరవై ఏళ్లుగా ఉన్న 33.కేవీ విద్యుత్ లైన్ ఇళ్ల పైనుండి వెళ్లడం వల్ల స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురి కావడమే కాకుండా, వర్షాకాలంలో షాక్ కు గురయ్యి ప్రాణాలు సైతం కోల్పోవడం జరిగిందని వివరించడం జరిగింది. ఇట్టి సమస్యను పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ ని కోరడం జరిగింది. వెంటనే స్పందించిన ఎం పి ఈటల రాజేందర్, ఎలక్ట్రికల్ డిపార్ట్ మెంట్ ఎ డి తో మాట్లాడి దానికి సంబంధించిన ఫండ్స్ ని ఎం పి లాడ్స్ నుండి ఇస్తానని ఎస్టిమేషన్ తయారు చేయాలని సూచించడం జరిగింది. ఇందుకు గాను అందరూ ఎం పి కి కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు శాంపూర్ విజేందర్ రెడ్డి, కంటెస్టెడ్ కార్పొరేటర్ కళ్యాణి శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు సత్తిబాబురాజు, మహిళా నాయకురాలు దేవి, మంగ, వరలక్ష్మి , ఘూస్పెర్, శ్రీను,, రషీద్, నజీర్, బేగం, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# కాలనీ సమస్యలపై ఎమ్మెల్యే ని కలిసిన పర్యావరణ ప్రేమికుడు కోల రవీందర్ ముదిరాజ్



కుత్బుల్లాపూర్, 24 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): శాసనసభ్యులు ,కే.పీ.వివేకానంద కి తమరితో మనవి చేయునది ఏమనగా 30,40 సంవత్సరాల క్రితం వివిధ బస్తీల్లో ప్రభుత్వ, అసెండ్ భూముల్లో నివాసముండి గత కాంగ్రెస్, టిడిపి, టిఆర్ఎస్,ప్రభుత్వాలు పట్టాలు ఇవ్వడం మరి అక్కడ సిసి రోడ్లు యు జు డి,కరెంటు సౌకర్యం కల్పించింది కానీ కుటుంబాలు పెరిగి వాటిని రెండు మూడు కుటుంబాలు విభజించుకున్న సందర్భంలో వారి కరెంటు మీటర్లు ఇవ్వకపోవడం చాలా బాధాకరం సర్వే నెంబర్లు నిషేధిత జాబితాలో పెట్టి రిజిస్ట్రేషన్ జరగకుండా ఉన్నాయి. కావున ప్రభుత్వం వారి బాధలు గ్రహించి వారికి నోటరీ పై కరెంటు మీటర్లు వచ్చే విధంగా నైనా ప్రభుత్వం ఇచ్చిన జీవోలు సవరించాలని సాయిబాబా నగర్ సూరారం కాలనీ వాజ్పేయి నగర్ శివాలయం నగర్ కృష్ణానగర్ మొదలగు బస్తీల ప్రజలు తీర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు వారికి కరెంటు మీటర్ లేకపోవడంతో ఒకటే మీటర్ పై రెండు మూడు కుటుంబాలు కరెంటు కాల్చడం వల్ల విపరీతమైన కరెంటు బిల్లు రావడం మీటర్లు కాలిపోవడం జరుగుతున్నాయి ఇక్కడైనా ప్రభుత్వం భూమిలో 75% సర్వే నంబర్లు ఇల్లు నిర్మించుకున్నట్లయితే అట్టి సర్వే నెంబర్లు నిషేధిత జాబితా లు తొలగించాలని లేనిచో 59 166 కింద కన్వెన్షన్ డిడి చేయాలని 25 సంవత్సరాల నుంచి జీవిస్తున్న వారికి కరెంటు మీటర్లు ఇవ్వమని చెప్పడం ఎలక్ట్రిసిటీ బోర్డ్ యొక్క నిర్లక్ష్యమా లేక ఉస్తే బస్సు కరెంటు డబ్బులు వసూలు కొరక ప్రభుత్వ బీదవారిపైన ఉక్కు పాదం మా అర్థం కావడం లేదని ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వపై తమరు అసెంబ్లీలో చర్చించి చట్టబద్ధత చచ్చే విధంగా ప్రయత్నం చేయాలని వివిధ బస్తీలకు చెందిన ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు ఎమ్మెల్యే స్పందించి సమస్యలను త్వరలో అధికారులతో మాట్లాడి చర్చిస్తానని అన్నారు ఈ కార్యక్రమంలో పర్యావరణ ప్రేమికుడు పోలా రవీందర్ ముదిరాజ్, ప్రెసిడెంట్ సందీప్ కుమార్, గోపాల్ రెడ్డి, శేషు, గణపతి, కృష్ణ, పలు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర కార్యదర్శి బడే దామోదర్ అలియాస్ చొక్కారావు లొంగుబాటు



ములుగు, 24 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): తాడ్వాయి మండలం కాల్వపల్లి గ్రామానికి చెందిన రాష్ట్ర కార్యదర్శి బడే దామోదర్ అలియాస్ చొక్కారావు దాదాపు 30 సంవత్సరాలుగా అజ్ఞాత జీవితం గడిపిన అనంతరం లొంగిపోయారు. 2024 డిసెంబర్‌లో అప్పటి జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ ఆధ్వర్యంలో నిర్వహించిన “పోరుకున్నా... ఊరు మిన్న” కార్యక్రమంలో భాగంగా ఆయన తల్లిద్వారా “ఇంటికి రా బిడ్డ” అంటూ చేసిన పిలుపు ఈ లొంగుబాటుకు దారితీసినట్లు తెలుస్తోంది. బడే దామోదర్‌తో పాటు మావోయిస్ట్ పార్టీకి చెందిన మరికొందరు కీలక నాయకులు కూడా లొంగిపోయారు. కేంద్ర కమిటీ కార్యదర్శి దేవ్ జీ అలియాస్ తిప్పిరి తిరుపతి, రాష్ట్ర కార్యదర్శి బడే దామోదర్ అలియాస్ చొక్కారావు, కీలక నేతలు మల్లా రాజిరెడ్డి మరియు నూనె నరసింహారెడ్డి కలిసి తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి సమక్షంలో లొంగిపోయారు. ఈ లొంగుబాటుతో మావోయిస్ట్ కార్యకలాపాలకు గట్టి దెబ్బ తగిలిందని పోలీసులు పేర్కొన్నారు.

# లయన్ శ్రీదేవి రెడ్డి కి బెస్ట్ ప్రెసిడెంట్ అవార్డు



తొర్రూరు, 24 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): లయన్ దామెర సరేష్ ఆధ్వర్యంలో జరిగిన వీరభద్ర రీజియన్ మీట్ లో మొత్తం 10 క్లబ్బు పోటీ పడగా లైన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూర్ సేవా తరుణి ప్రెసిడెంట్ లయన్ శ్రీదేవి రెడ్డికి ఫస్ట్ బెస్ట్ ప్రెసిడెంట్ అవార్డు, ఫస్ట్ బెస్ట్ స్క్రాప్ బుక్ అవార్డ్, ఫస్ట్ బెస్ట్ బ్యానర్ ప్రజెంటేషన్ అవార్డు , లయన్ డాక్టర్ ఎస్ నాగవాణి ఎక్స్టెన్షన్ చైర్ పర్సన్ అవార్డు, బెస్ట్ ట్రెజరర్ అవార్డు మంజుల కి, మెంటల్ హెల్త్ వెల్ బీయింగ్ అవార్డ్ లైన్ డాక్టర్ వి శారద కి, సపోర్టెడ్ లైన్స్ సెక్రటరీ పద్మావతి కి ఉమారెడ్డి, డాక్టర్ మిరాజ్ కి మరియు వివిధ రకాల సర్వీస్ ఆక్టివిటీస్ కి గాను 25 అవార్డ్స్ క్లబ్బుకు రావడం జరిగింది. ఈ సందర్భంగా ప్రెసిడెంట్ శ్రీదేవి మాట్లాడుతూ క్లబ్ సభ్యులందరి సమిష్టి కృషివలనే ఈ విజయం సొంతమైందని, అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.



# టీజీ24 టివీ నూతన సంవత్సర క్యాలెండర్ ను, ఆవిష్కరించిన, ఖమ్మం డిపిఆర్ఓ.



ఖమ్మం, 24 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): టీజీ24 టివి నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించిన, ఖమ్మం జిల్లా డి.పి.ఆర్.ఓ గౌస్ పాషా, అనంతరం మాట్లాడుతూ, టీజీ24 టీవీ ప్రజా సమస్యలను, ప్రభుత్వ యంత్రాంగం దృష్టికి తీసుకువెళ్తూ, ప్రభుత్వ పథకాలను కూడా ప్రజలకు తెలియపరుస్తూ, ప్రజా చైతన్యానికి తోడ్పాటు అవుతూ, సామాన్య ప్రజల మన్ననలను పొందుతూ, ముందుకు సాగుతుందని అన్నారు. మీ న్యూస్ ఛానెల్ ఎల్లప్పుడూ ప్రజల గొంతుకగా ఉంటూ, ప్రజా సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ తోడుపాటు అందిస్తూ, ముందుకు సాగాలని పేర్కొన్నారు.

# సీఎం సహాయనిధి పేదలకు గొప్పవరం

## - నియోజకవర్గ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి



కుత్బుల్లాపూర్, 24 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): నియోజకవర్గంలోని బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో 280 డివిజన్ జగద్గిరిగుట్ట వాసులు రామోజు లక్ష్మి, గత కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతు నిమ్స్ హాస్పిటల్ చికిత్స పొందుతున్నది చికిత్సకి సరిపడ్డ డబ్బులు లేక కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ని సంప్రదించిన వెంటనే స్పందించి రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ద్వారా బాధితురాలికి శస్త్ర చికిత్స నిమిత్తం రూ. 2,00,000/- ల సీఎం సహాయనిధి - ఎల్వోసీ ని మంజూరి చేయించారు. రూ 2,00,000/- సీఎంఆర్ఎఫ్ - ఎల్ ఓ సి మంజూరి పత్రాలను అనంత్ చారి కి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి, అందజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు గణేష్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు నరేందర్ రెడ్డి, ఎల్లయ్య కాకా, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పనులు ప్రారంభించిన సర్పంచ్ రాజేందర్



నర్సింహులపేట, 24 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): మండలంలోని లోక్య తండ గ్రామపంచాయతీలో పరిధిలోని పాండ్య తండా వాసులకు గ్రామీణ ఉపాధి హామీ పథకం లోక్యతండ సర్పంచ్ గుగులుత రాజేందర్ నాయక్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాజేందర్ మాట్లాడుతూ లోక్యతండ గ్రామ ప్రజలకు అందరూ ఈ ఉపాధి హామీ పథకం వినియోగించుకోవాలని ఆయన కోరారు అదేవిధంగా ఎవరైతే జాబ్ కార్డు లేని వారు అయితే వాళ్లకు సంబంధించిన ఆధార్ కార్డు గ్రామపంచాయతీకి సెక్రటరీ గాని సర్పంచ్ గానీ అందజేయగలరు తమ యొక్క జాబ్ కార్డ్ లో మీ పేరు పొందుపరచబడును. ఈ మంచి అవకాశాన్ని లోక్యతండ పంచాయతీగ్రామ ప్రజలు అందరూ సద్వినియోగించుకోవాలని సర్పంచ్ తండావాసులను ఆయన కోరారు ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు గుగులోతు రవి నాయక్ ఉప సర్పంచ్ రాందాస్ పాండ్యా తండా మేట్ దేవేందర్ తండా ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



క్రాంతి
# ఆంధ్రప్రదేశ్
epaper.krtvnews.com

## శ్రీకాకుళంలో 65 మందికి డయేరియా కలకలం సీఎం చంద్రబాబు సమీక్ష



ఏపీ న్యూస్, 24 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): శ్రీకాకుళంలో డయేరియా కలకలం రేపుతోంది. ఈ డయేరియా ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంగళవారం సమీక్షించారు. జిల్లా అధికారులతో కూడా మాట్లాడారు. క్షేత్ర స్థాయిలో అందుతున్న వైద్యంపై ఆరా తీశారు. శ్రీకాకుళం నగరంలో రోడ్ రిపేర్ పనుల కారణంగా మంచి నీటి పైపు లైన్లు దెబ్బతిని డయేరియా వ్యాపించిందని అధికారులు సీఎంకు తెలిపారు. ఈ ఘటనలో మొత్తం 65 మంది వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఎనిమిది మంది ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు.

ఇద్దరి పరిస్థితి విషమం..

జెమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని, ప్రస్తుతం వారికి వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నామని అధికారులు తెలిపారు. తాగునీటి కాలుష్యం జరగకుండా క్లోరినేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని, మురుగునీటి కాలువల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సీఎం సూచించారు. ప్రజలు భయాందోళనకు గురి కాకుండా అవగాహన కల్పించాలని, క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి బాధితులకు ధైర్యం చెప్పాలని ఆదేశించారు.

## వైసీపీ హయాంలో పేదలకు ఇళ్ల పేరుతో రూ.6 వేల కోట్లు దోచేశారు..!



ఏపీ న్యూస్, 24 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పాలనా కాలంలో పేదలందరికీ ఇళ్లు పేరుతో 6 వేల కోట్ల రూపాయాల కుంభకోణాలకు పాల్పడ్డారని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆరోపించారు.. శాసనసభలో టీడీపీ ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ గత ప్రభుత్వం 22 లక్షల మందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేస్తే అందులో 7 లక్షల మంది కన్వేయన్స్ డీడ్ లు. తీసుకోలేదన్నారు మంత్రి అనగాని... ఇళ్ల పట్టాల కోసం నివాస యోగ్యం కాని పల్లపు భూములు, శ్మశానాలు, ఊరికి దూరంగా ఉండే భూములు, వర్షాలకు మునిగి పోయే భూములను రెండింతలు, మూడింతలు అధిక రేట్లు ఇచ్చి సేకరించరాని చెప్పారు. ఇళ్ల పట్టాలు నివాసయోగ్యంగా లేని కారణంగా రెండున్నర లక్షల మంది ఇళ్ల పట్టాలు తీసుకునేందుకు నిరాకరించారని తెలిపారు. ఇళ్ల పట్టాల పంపిణీలో అక్రమాలకు పాల్పడ్డారని, తమ ప్రభుత్వం విచారణ చేయించగా 43,948 మంది అనర్హులు తేలినట్లు చెప్పారు. పరిశీలనలో ఇంకా 1, లక్షా 11 వేల 37 మంది... లబ్దిదారులు ఉన్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అందరికీ ఇళ్లు పేరుతో గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు ఇవ్వాలని నిర్ణయించామన్నారు. అయితే గత ప్రభుత్వం సెంటున్నర, సెంటు మాత్రమే ఇచ్చిందని గుర్తు చేశారు. ప్రస్తుతం మొత్తం 4,లక్షల..8,వేల. 876 దరఖాస్తులు ఇళ్ల పట్టాల కోసం వచ్చాయన్నారు.

## బసినేనిపల్లి టీడీపీలో విభేదాలు.. ఇద్దరికే ప్రాధాన్యతపై అసంతృప్తి

ఏపీ న్యూస్, 24 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): ఉదయగిరి నియోజకవర్గం సీతారాంపురం మండలం బసినేనిపల్లి పంచాయతీలో తెలుగు దేశం పార్టీలో అసంతృప్తి బహిరంగంగా బయటపడుతోంది. ఏళ్ల తరబడి పార్టీ కోసం చెమటోడ్చిన సీనియర్ నాయకులను పక్కనబెట్టి కేవలం ఇద్దరికే ప్రాధాన్యత ఇస్తున్నారని కార్యకర్తలు మండిపడుతున్నారుప్రతిపక్షంలో ఉన్నప్పుడు వైసీపీకి గట్టిగా ఎదురు నిలబడి, పార్టీ జెండాను ఎగరవేసిన నాయకులు ఇప్పుడు గుర్తింపే లేకుండా పోయారనే ఆవేదన వ్యక్తమవుతోంది.

“పంచాయతీలో పార్టీ కోసం కష్టపడింది వాళ్ళిద్దరేనా? మిగతా నాయకులు లేరా?” అంటూ కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు. మండల నాయకత్వం ఎందుకు ఇద్దరినే ముందుకు తెస్తోంది?, సీనియర్ల అనుభవం, పాత కార్యకర్తల త్యాగాలు విలువలేనివేనా? అనే చర్చ జోరుగా సాగుతోంది. స్థానికంగా ఈ వ్యవహారం చర్చనీయాంశంగా మారగా పార్టీ ఉన్నత నాయకత్వం జోక్యం చేసుకుని అందరినీ కలుపుకుని వెళ్లాలనే డిమాండ్ వినిపిస్తోంది. లేదంటే ఈ అసంతృప్తి భవిష్యత్తులో పార్టీకి నష్టమేనని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి.

## ఏపీ రాగం.. కేఆర్ఎంబీ తాళం.. ఏపీ ఆడిందే ఆట, పాడిందే పాట




ఏపీ న్యూస్, 24 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ సర్కార్ అసమర్థతతో ఏపీ ఆడింది ఆట, పాడింది పాటగా కొనసాగుతున్నది. ఏపీ తానా అంటే కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్ఎంబీ) తందాన అంటూ వంతపాడుతున్నది. అందుకు సాగర్ డ్యామ్ నిదర్శనంగా నిలుస్తున్నది. ఏపీ స్వాధీనం చేసుకున్న సాగర్ గేట్లను తిరిగి అప్పగించలేదు. ఆ రాష్ట్రం ఇష్టారీతిన చేపడుతున్న నీటి మళ్లింపులను కేఆర్ఎంబీ పర్యవేక్షించడం లేదు. దీనిపై తెలంగాణ ఫిర్యాదు చేసినా బోర్డు పట్టించుకున్న దాఖలాలు లేవు. కానీ, సాగర్ గేట్లకు మాత్రం తెలంగాణే మరమ్మతులు చేయాలట. ఈ విషయమై ఏపీ అడిగిందే తడవుగా తెలంగాణ సర్కార్‌కు కేఆర్ఎంబీ లేఖ రాసింది. సాగర్ కుడివైపు గేట్లకు మరమ్మతులు చేయాలని ఆ లేఖలో ఆదేశించింది. దీనిపై తెలంగాణ ఇంజినీర్లు భగ్గుమంటున్నారు.

ఏపీ ఆధీనంలోనే 13 గేట్లు

రాష్ట్ర విభజన జరిగినప్పటి నుంచి నాగార్జునసాగర్ డ్యామ్ నిర్వహణ తెలంగాణ, శ్రీశైలం డ్యామ్ నిర్వహణ ఏపీ చూస్తున్నది. గేట్ల రబ్బర్ సీల్స్, గ్రీజింగ్, రోప్‌ల మార్పిడి, గ్యాంట్రీ పట్టాల మార్పిడి, గ్యాలరీ తదితర పనులను నిర్వహిస్తున్న ఏపీ సర్కార్.. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ నిమగ్నమై ఉన్న వేళ అక్రమంగా సాయుధబలగాలతో తరలివచ్చి డ్యామ్ కుడివైపు భాగాన్ని (13వ గేట్ వరకు), కుడికాలువ రెగ్యులేటర్‌ను ఆక్రమించుకున్నది. దీంతో కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని అక్కడ సీఆర్పీఎఫ్ బలగాలను ఏర్పాటు చేసింది. అప్పటి నుంచి డ్యామ్ కుడివైపు కాంపొనెంట్లన్నీ ఏపీ ఆధీనంలోనే ఉండటంతో సాగర్ కుడికాలువ హెడ్‌రెగ్యులేటర్లను ఇష్టారీతిన ఆపరేట్ చేస్తూ నీళ్లను మళ్లించుకుపోతున్నది. గేట్ల నిర్వహణను మాత్రం పూర్తిగా గాలికి వదిలేసింది. దీంతో ఆ డ్యామ్ నిర్వహణను పూర్తిగా తిరిగి తెలంగాణకు అప్పగించాలని రాష్ట్ర అధికారులు అనేకమార్లు కేఆర్ఎంబీకి విజ్ఞప్తి చేశారు. చోద్యం చూస్తున్న బోర్డు కనీసం నీటి లెక్కలను పర్యవేక్షించడంలేదు.

నాడు అలా.. నేడు ఇలా..

ప్రస్తుతం సాగర్ డ్యామ్ కుడివైపు గేట్లను మరమ్మతు చేసేందుకు సైతం తెలంగాణ అధికారులను ఏపీ అనుమతించడం లేదు. గతంలో తెలంగాణ ప్రభుత్వం బోర్డు అనుమతులతో కుడివైపు డ్యామ్ నిర్వహణ పనులను చేపట్టడంపై ఏపీ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఆ పనులను ఎందుకు చేస్తున్నారు? అవి అత్యవసరమైనవా? కావా? అనే విషయాలను తెలుసుకోవాలని ఏకంగా కేఆర్ఎంబీకే లేఖ రాసింది. ఆ తర్వాత ఏపీ భూభాగంలో ఉన్న డ్యామ్ నిర్మాణాలకు సంబంధించిన మరమ్మతులు, నిర్వహణ పనులను తామే చేసుకుంటామని బోర్డుకు తేల్చిచెప్పింది. అందుకు అనుమతులివ్వాలని బోర్డు చైర్మన్‌కు లేఖ రాసింది. అంతేకాకుండా వర్షాకాలం ముందు, ఆ తర్వాత చేపట్టాల్సిన తనిఖీలు, సాధారణ, అత్యవసర పనులు, నీటి విడుదల పర్యవేక్షణను తమకే అప్పగించాలని డిమాండ్ చేసింది. ఈ నేపథ్యంలో మరమ్మతుల అంశంపై త్రిసభ్య కమిటీ సమావేశాన్ని నిర్వహించి నిర్ణయం తీసుకోవాలని గతంలో బోర్డు నిర్ణయించినా తుదకు ఆ పనులను మళ్లీ ఏపీకే అప్పగించింది. దీంతో డ్యామ్ నిర్వహణను ఏపీ పూర్తిగా గాలికి వదిలేసింది.

హెడ్‌రెగ్యులేటర్ గేట్లను ఇష్టారాజ్యంగా ఆపరేట్ చేయడంతోపాటు గ్రీజింగ్ తదితర పనులను నిర్వహించకపోవడంతో అనేక రకాల సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రస్తుతం ఆ గేట్లు ప్రమాద స్థితికి చేరుకున్నట్టు తెలుస్తున్నది. ఈ నేపథ్యంలో ఇటీవల సాగర్ డ్యామ్‌ను సందర్శించిన ఎన్‌డీఎస్‌ఏ, కేఆర్ఎంబీ బృందం.. కుడికాలువ హెడ్‌రెగ్యులేటర్ నిర్వహణపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. దీంతో ఈ పరిస్థితికి తెలంగాణే కారణమని పేర్కొంటూ ఏపీ ఉల్టా వాదనలు మొదలు పెట్టడటంతోపాటు బోర్డుకు మరోసారి లేఖ రాసింది. డ్యామ్ నిర్వహణ పనులను చేపట్టకుండా తెలంగాణదే బాధ్యతని పేర్కొనడం ఏపీ సర్కార్ దుర్మార్గానికి అద్దం పడుతున్నది. ఇక ప్రస్తుతం ఏపీ లేఖ రాసిందే తడవుగా బోర్డు సైతం తెలంగాణ వివరణ కోరింది. సాగర్ డ్యామ్ కుడివైపు కాంపొనెంట్లకు తెలంగాణ సర్కారే మరమ్మతులు చేయాలని ఆదేశిస్తూ లేఖ రాసింది. దీంతో ఏపీకి కేఆర్ఎంబీ వంతపాడుతున్నట్టు మరోసారి రుజువైంది. ఈ పరిస్థితికి రేవంత్‌రెడ్డి సర్కార్ అసమర్థతే కారణమని తెలంగాణ ఇంజినీర్లు నిప్పులు చెరుగుతున్నారు.

## ఏపీ కేబినెట్ కీలక నిర్ణయాలు.. 56 అజెండా అంశాలకు ఆమోదం



ఏపీ న్యూస్, 24 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర కేబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. మొత్తం 56 అజెండా అంశాలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. పెట్టుబడులు, పర్యాటకం, ఇంధన ప్రాజెక్టులు, ఉన్నత విద్య, పరిశ్రమలు వంటి అనేక రంగాలకు సంబంధించిన ప్రతిపాదనలపై చర్చించి నిర్ణయాలు తీసుకుంది. రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి తీసుకున్న నిర్ణయాలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. విశాఖలో రూ. 2,387 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేయనున్న సెమీ కండక్టర్ పరిశ్రమకు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ ప్రాజెక్టు ద్వారా భారీ స్థాయిలో ఉపాధి అవకాశాలు కల్పించబడనున్నట్లు ప్రభుత్వం భావిస్తోంది.

పర్యాటక రంగానికి ఊతం

విశాఖపట్నం, తిరుపతి, కాకినాడ జిల్లాల్లో పర్యాటక ప్రాజెక్టులకు కేబినెట్ సమావేశంలో ఆమోదం లభించింది. అలాగే శ్రీ సత్యసాయి జిల్లా, చీరాల, రాజమండ్రి ప్రాంతాల్లో కొత్త పర్యాటక ప్రాజెక్టులకు కూడా కేబినెట్ మంజూరు ఇచ్చింది. ఇక, సౌర, పవన మరియు హైబ్రిడ్ విద్యుత్ ప్రాజెక్టుల ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. ముఖ్యంగా అనంతపురం, కర్నూలు జిల్లాల్లో ఈ ప్రాజెక్టులు ఏర్పాటు చేయనున్నారు. ఇక, ఉన్నత విద్య మరియు నైపుణ్యాభివృద్ధి శాఖల బలోపేతానికి కేబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. విద్యార్థులకు ఆధునిక నైపుణ్యాలు అందించే దిశగా చర్యలు చేపట్టనుంది.

భూకేటాయింపులు, కొత్త శాఖ

వివిధ సంస్థలకు భూకేటాయింపుల అంశంపై చర్చించి నిర్ణయాలు తీసుకుంది. అదేవిధంగా సైన్స్, టెక్నాలజీ మరియు ఇన్నోవేషన్ శాఖ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది కేబినెట్.. కొల్లేరు లేక్ అభయారణ్య సరిహద్దుల ఖరారుకు సంబంధించిన ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వానికి పంపాలని నిర్ణయించింది. మొత్తంగా, పెట్టుబడులు ఆకర్షించడం, పరిశ్రమల అభివృద్ధి, పర్యాటక రంగానికి ప్రోత్సాహం, పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులు మరియు విద్యాభివృద్ధిపై ఈ కేబినెట్ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు తెలుస్తోంది.

## రూ. 500 కోసం కొట్టుకున్న అర్చకులు.. పోలీస్ స్టేషన్‌కెక్కిన పంచాయితీ



ఏపీ న్యూస్, 24 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): నంద్యాల జిల్లా నందికొట్కూరులో దారుణం జరిగింది. రూ. 500 కోసం అర్చకుల మధ్య ఘర్షణ జరిగింది. చౌడేశ్వరి దేవాలయంలో పూజారిగా పని చేస్తున్న వీరేష్‌పై సూర్యనారాయణ దేవాలయానికి చెందిన అర్చకుడు సురేష్ దాడి చేశారు. తనపై మాటల దాడితో పాటు శారీరకంగా కూడా దాడి చేసినట్లు పోలీసులకు బాధిత పూజారి వీరేష్ ఫిర్యాదు చేశారు. దీంతో ఫిర్యాదుపై విచారణ జరుపుతున్నారు.

దీంతో ఈ ఘటనపై ఆలయ ప్రధాన కార్యదర్శి చట్ట మురళి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలయ ప్రతిష్టలను మంటగోలిపిన పూజారి సురేష్‌పై కటిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. దేవాలయం పవిత్రతను కాపాడాల్సిన అర్చకులే ఇలా గొడవలకు దిగడం చాలా దురదృష్టకరమని అటు స్థానికులు అంటున్నారు.

## రాజమండ్రి కల్తీ పాల ఘటనలో నిందితుడు అరెస్ట్.. రిమాండ్



ఏపీ న్యూస్, 24 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): రాజమండ్రిలో కల్తీ పాలు తాగి ఐదుగురు చనిపోయిన విషయం తెలిసిందే. అయితే ఈ కేసులో నిందితుడు గణేష్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించి కోర్టులో ప్రవేశపెట్టారు. దీంతో గణేష్‌కు ధర్మాసనం 14 రోజుల పాటు రిమాండ్ విధించింది. ఈ మేరకు నిందితుడిని రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు.

కల్తీ పాలు తాగి...

కాగా రాజమండ్రిలోని రెండు కాలనీల్లో కల్తీ పాలు తాగి తొలుత నలుగురు మృతి చెందగా.. తాజాగా బాలుడు మృతి చెందారు. విశాఖలో చికిత్స పొందుతూ మరణించారు. మొత్తం ఈ ఘటనలో 16 మంది బాధితులు కాగా.. గత పదేళ్ల నుంచి ఒకే వ్యక్తి పాలు పోయించుకున్నట్లు తేలింది. అయితే ఇటీవల పాలు రుచి తేడాగా ఉండటంతో వాంతులు అయ్యాయి. అదే రోజు మొత్తం 110 కుటుంబాలకు పాలు పోశారు. మొత్తం 315 మంది రక్తనమూనాలను అధికారులు సేకరించి ల్యాబ్‌కు పంపారు. ప్రస్తుం ఇందుకు కారణమైన నిందితుడు గణేష్‌ను అరెస్ట్ చేసి జైలుకు తరలించారు

మన క్రాంతి KR TV ఇది వాస్తవ పత్రిక...
బుధవారం 25 ఫిబ్రవరి 2026

## శ్రీరాముని పాలనలా గ్రామాలు అభివృద్ధి చేయాలి
## శిక్షణలో కలెక్టర్ డాక్టర్ సత్య శారద పిలుపు



గీసుకొండ, 24 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): గ్రామాల్లో నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లు శ్రీరాముని మాదిరి న్యాయపాలన అందించి గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచించారు. గీసుకొండ మండలంలోని జాతీయ ఆదర్శ గ్రామం గంగాదేవిపల్లిలో మంగళవారం నిర్వహించిన మూడవ విడత సర్పంచ్‌ల శిక్షణ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ శిక్షణలో వరంగల్ జిల్లాకు చెందిన వర్ధన్నపేట, నల్లబెల్లి, పర్వతగిరి, నెక్కొండ మండలాల నుంచి మొత్తం 117 మంది సర్పంచ్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధి ద్వారానే ప్రజల్లో విశ్వాసం పెరుగుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ నిధులతో పాటు ప్రజల భాగస్వామ్యాన్ని పెంచుకుని అదనపు వనరులు సమీకరించి గ్రామాలను అభివృద్ధి పరచాలని సూచించారు. పారదర్శక పాలన, సమన్వయం, సమర్థ ప్రణాళికలే గ్రామ ప్రగతికి కీలకమని అన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి రాం రెడ్డి, డిపివో కటకం కల్పన, డీఎల్పీవో కుంట రాజీవ్ కుమార్, గీసుకొండ తహసీల్దార్ ఎం.డి. రియాజుద్దిన్, ఎంపీడీఓ, లెక్కల అధికారి అరుంధతి, ఎంపీఓలు పాక శ్రీనివాస్, అంబటి సునీల్ కుమార్ రాజు, కుచన ప్రకాష్, జిల్లా ట్రైనింగ్ మేనేజర్ కూసం రాజమౌళి, ఆర్ఐ సాంబయ్య, పంచాయతీ కార్యదర్శి రమ్య కుమారి, జీపీవో రమేష్ తదితరులు పాల్గొన్నారు. గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దే దిశగా ఈ శిక్షణలు సర్పంచ్‌లకు మార్గదర్శకంగా నిలుస్తాయని అధికారులు పేర్కొన్నారు.

## ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల సందర్భంగా
## పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్త్

### సెక్షన్ 163 బిఎన్ఎస్ఎస్ (144 సెక్షన్) అమలు
### - కె.నరసింహ ఐపిఎస్, ఎస్పి



సూర్యాపేట, 24 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగుతున్న, సందర్భంగా పరీక్షా కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీసు, బందోబస్తు ఏర్పాటు చేశామని, జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిధిలోని పరీక్ష కేంద్రాల వద్ద శాంతిభద్రతల రక్షణ లో, భాగంగా సెక్షన్ 163 బిఎన్ఎస్ఎస్ (144 సెక్షన్) అమలు చేయనున్నట్లు తెలిపారు.జిల్లాలో 25-02-2026 నుండి 18-03-2026 వరకు పరీక్షలు జరుగుతుండగా, పరీక్షల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలుగా ఈ నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయని తెలిపారు.

విధించిన నిబంధనలు: పరీక్ష కేంద్రాల పరిసరాల్లో ముగ్గురు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులు గుమికూడరాదు, నిషేధిత వస్తువులతో పరీక్ష కేంద్రాల వద్ద తిరగడం నిషేధం, పరీక్ష కేంద్రాల నుండి 200 మీటర్ల పరిధిలోని అన్ని జిరాక్స్ కేంద్రాలు తేది 25-02-2026 నుండి 18-03-2026 వరకు ప్రతిరోజూ ఉదయం 08:00 గంటల నుండి మధ్యాహ్నం 01:00 గంటల వరకు మూసివేయాలని ఆదేశించారు, పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని, విద్యార్థులు పరీక్ష సమయం కన్నా అరగంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోండి. పరీక్ష కేంద్రాల వద్ద మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురావద్దని, కట్టుదిట్టమైన తనిఖీలు నిర్వహిస్తామన్నారు. ప్రశ్నాపత్రాల రవాణా, భద్రతా పరంగా ప్రత్యేక ఎస్కార్ట్ ను ఏర్పాటు చేశామన్నారు. సెంటర్ల పరిసర ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తులపై నిఘా ఏర్పాటు చేసి ఎలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

## విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ




ఇనుగుర్తి, 24 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): లయన్స్ క్లబ్ కేసముద్రం అధ్యక్షులు మామిడి అశోక్ ఆధ్వర్యంలో ఇనుగుర్తి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 8వ,9వ తరగతి విద్యార్థిని విద్యార్థులకు ఉచిత నోట్స్ బుక్స్ ను మంగళవారం పంపిణీ చేశారు.. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షులు మామిడి అశోక్ మాట్లాడుతూ విద్య ద్వారా మాత్రమే జీవితంలో ఉన్నత స్థానాలను చేరుకోవడానికి, సమాజంలో గుర్తింపు పొందడానికి అవకాశం ఉంటుంది కాబట్టి విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీవివేకవర్ధిని విద్యాసంస్థల చైర్మన్ చిర్రా యాకాంతం గౌడ్, యర్నం శ్రీరాములు, బెజ్జం ప్రేమ్ కుమార్, మారం సమ్మిరెడ్డి, పాఠశాల ఇన్చార్జి హెచ్ఎం యాకయ్య,అయ్యగారిపల్లి సర్పంచ్ మలిశెట్టి శోభన్, తదితరులు పాల్గొన్నారు.

## బంజారాలలో చైతన్యం కల్పించడానికి విశేష కృషి చేసిన గొప్ప వ్యక్తి సంత్ సేవాలాల్

### స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ కేంద్రంలో 2కోట్లతో బంజారా భవన్ నిర్మాణం అవుతోంది
### వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, ఎమ్మెల్యే కడియం శ్రీహరి



స్టేషన్ ఘనపూర్, 24 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): స్టేషన్ ఘనపూర్ పట్టణ కేంద్రంలోని పద్మావతి గార్డెన్స్ నిర్వహించిన శ్రీ సంత్ సేవాలాల్ 287వ జయంతి వేడుకలలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య,ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా స్టేషన్ ఘనపూర్ లోని అంబేద్కర్ విగ్రహం నుండి జఫర్ గడ్ రోడ్ లోని పద్మావతి గార్డెన్స్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.ఈ ర్యాలీలో బంజారా ఆడపడుచులు సాంప్రదాయ వస్త్రాధారణతో పాటలు పాడుతూ,నృత్యం చేస్తూ సందడి చేశారు.చివరలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య సైతం నృత్యం చేసి వారిలో ఉత్సాహం నింపారు.ఈ సందర్భంగా భోగ్ బండార్ తో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించి శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

అనంతరం ఏర్పాటు చేసిన సభలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ....బంజారా సమాజానికి మార్గదర్శిగా నిలిచిన శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జీవితం త్యాగం,సేవ,సమానత్వానికి ప్రతీక అని అన్నారు.ఆయన బోధనలు నేటి యువతకు ఆదర్శప్రాయమైనవని పేర్కొన్నారు.బంజారా గిరిజనుల సంస్కృతి,సంప్రదాయాలను పరిరక్షించడమే కాకుండా వారి అభివృద్ధికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు.విద్య,ఉపాధి,సంక్షేమ పథకాల ద్వారా బంజారా సమాజాన్ని ప్రధాన ప్రవాహంలోకి తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు.తన జీవితమంతా బంజారాల అభ్యున్నతికే అంకితం చేసిన సంతు సేవాలాల్ జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని ఎంపీ పేర్కొన్నారు.గ్రామాల్లో విద్య,వైద్యం,పరిశుభ్రత రంగాల్లో అభివృద్ధి సాధించి,గ్రామాలను మోడల్ గ్రామపంచాయతీలుగా తీర్చిదిద్దే దిశగా సర్పంచులు కృషి చేయాలని సూచించారు.బంజారా జాతి అభివృద్ధికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని,స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలోని అన్ని తండాలను సమగ్రంగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.ఇందుకు అవసరమైన నిధులను ఎంపీ,ఎమ్మెల్యే నిధుల నుంచి కేటాయిస్తామని తెలిపారు.సేవాలాల్ ఆశీస్సులతో అందరం ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.రాజ్యాంగం కల్పించిన హక్కుల ప్రకారం ఆడపిల్లల విద్యకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలని,కష్టపడి చదివించి ఉన్నత స్థాయికి చేరేలా ప్రతి కుటుంబం బాధ్యత తీసుకోవాలని సూచించారు.

ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ...1739లో ఒక చిన్న మారుమూల తండాలో జన్మించిన శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ బంజారాలలో చైతన్యం కల్పించేందుకు విశేష కృషి చేశారని తెలిపారు.స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం కేంద్రంలో 2కోట్లతో బంజారా భవన్ నిర్మాణం వేగంగా నిర్మాణం అవుతోందని,ఆ భవన నిర్మాణం పూర్తి అయితే మన ఏ కార్యక్రమం అయిన అందులోనే చేసుకోవచ్చని అన్నారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని తండాలను అన్ని రకాలుగా అభివృద్ధి చేసే బాధ్యత నాదని హామీ ఇచ్చారు.స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలోని 27తండా గ్రామ పంచాయితీలలో గ్రామ పంచాయతీ భవనాలు లేని తండాలకు వెంటనే గ్రామ పంచాయతీ భవనాలు మంజూరు చేస్తానని తెలిపారు.నియోజకవర్గంలోని అన్ని తండాలకు ఇప్పటికే బిటీ రోడ్లు వేసామని,ఇంకా ఏమైనా ఉంటే వాటిని కూడా త్వరలోనే పూర్తి చేస్తానని అన్నారు.తండాలలో త్రాగు నీరు,డ్రానేజి,సిసి రోడ్ల వంటి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.నియోజకవర్గంలోని 27తండా గ్రామ పంచాయతీలకు 15రోజులలలో 5లక్షల నిధులు మంజూరు చేస్తానని వెల్లడించారు.అలాగే రెండో విడత ఇందిరమ్మ ఇళ్లలో అధిక ప్రాధాన్యత కల్పిస్తానని తెలిపారు.అతి త్వరలోనే 27తండా సర్పంచ్ లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి తండాలలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై వివరంగా చర్చిస్తానని పేర్కొన్నారు. తండాలలో అన్ని రకాల అభివృద్ధి పనులు చేసే బాధ్యత నాదని అందుకు మీరు చేయాల్సింది మీ పిల్లలను బాగా చదివించాలని తెలిపారు.చదువుతోనే అన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తుందని అన్నారు.అలాగే మద్యపానానికి దూరంగా ఉండలాని సూచించారు.మద్యపానం,మత్తుపదార్థాలకు బానిస కావడం వల్ల కుటుంబాలు నాశనం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.మద్యపానం,మత్తు పదార్థాలకు దూరంగా ఉండే విధంగా సర్పంచులు చర్యలు తీసుకోవాలని తెలిపారు.గ్రామాలలో సర్పంచులు బెల్ట్ షాపులు నడుపుతున్నట్లు నాకు తెలిస్తే వారి బెల్ట్ తీస్తానని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఆర్డివో వెంకన్న,సేవాలాల్ గురు బీ రమేష్ మహారాజ్,జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాంబాబు,మార్కెట్ కమిటి చైర్మన్ లావణ్య శిరీష్ రెడ్డి,మున్సిపల్ చైర్మన్ వినయ్ కుమార్,మున్సిపల్ కౌన్సలర్లు,తహసీల్దార్లు,ఎంపిడివోలు,27తండా గ్రామ పంచాయతీల సర్పంచ్ లు,మాజీ జడ్పీటీసీ లు,మాజీ ఎంపీటీసీలు,ఇతర ప్రజాప్రతినిధులు,నాయకులు,కార్యకర్తలు,బంజారా మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతపై ప్రత్యేక చైతన్యం
## గీసుకొండ సిఐ,డి. విశ్వేశ్వర్




గీసుగొండ, 24 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): రోడ్డు ప్రమాదాలను తగ్గించడమే లక్ష్యంగా చేపట్టిన 'అరైవ్ అలైవ్' కార్యక్రమం రెండో దశలో భాగంగా గీసుగొండ పోలీసులు మంగళవారం సాయంత్రం ఉకల్ గ్రామ కేంద్రంలో హెల్మెట్ వినియోగంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్ఓ ఆధ్వర్యంలో ఎస్ఐ కుమార్, పోలీసు సిబ్బంది ద్విచక్ర వాహనదారులతో నేరుగా మాట్లాడి హెల్మెట్ ధరించడం ప్రాణరక్షణకు అత్యంత కీలకమని వివరించారు. రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ, ప్రజల్లో భద్రతా చైతన్యం పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తామని పోలీసులు తెలిపారు.

## రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో మిక్స్ డబుల్స్ విజేతగా మున్నూరు కాపు బిడ్డ

### మేఘ వర్షిత్ ను, అభినందించిన పొదిల రవి కుమార్



ఖమ్మం/హైదరాబాద్, 24 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): హైదరాబాద్ గచ్చిబౌలి జి.ఎం.సి బాలయోగి స్టేడియంలో జరుగుతున్న చీఫ్ మినిస్టర్ కప్ రాష్ట్రస్థాయి పోటీల్లో 2025 మిక్స్ డబుల్. విభాగంలో, ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపాలిటీ వరంగల్ క్రాస్ రోడ్ కు చెందిన మన మున్నూరు కాపు బిడ్డ, వేమన మేఘ వర్షిత్ కాంస్య పథకాన్ని సాధించారు. ఈ సందర్భంగా వర్షిత్ ను, అభినందించిన మున్నూరు కాపు జిల్లా మరియు నగర నాయకత్వంమున్నూరు కాపు సీనియర్ నాయకులు పొదిల రవి కుమార్ ఆధ్వర్యంలో, చిరు సత్కారం చేసి అభినందించారు. ఈ అభినందిన కార్యక్రమంలో శెట్టి రంగారావు, బొమ్మిశెట్టి రమేష్, మాటేటి రవి, చౌడం నరసింహరావు, జివివిఎల్ నరసింహరావు, సి.హెచ్ విప్లవ కుమార్, గుంటుపల్లి శ్రీదేవి, హారిక నాయుడు, తిరుమలశెట్టి జయ ప్రకాశ్ మరియు వాళ్ళ నాన్న వేమన శ్రీనివాస్ పాల్గొన్నారు.

## కౌండిన్య అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా నుండి ప్రమాద బాధితుడికి రూ.10,000 ఆర్థిక సహాయం

### తెలంగాణ గౌడ సంఘం తరఫున కాన సంస్థకు ప్రత్యేక కృతజ్ఞతలు



జాఫర్గఢ్, 24 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): కౌండిన్య అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా (కేఏఎన్ఏ) ఆధ్వర్యంలో జనగామ జిల్లాకు చెందిన ఒక ప్రమాద బాధితుడికి రూ.10,000 ఆర్థిక సహాయం అందజేయడం జరిగింది.ఈ సహాయంపై బాధిత కుటుంబ సభ్యులు,గ్రామ ప్రజలు,గౌడ సంఘం ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.జనగామ జిల్లా జనగామ జిల్లాలోని జాఫర్గఢ్ మండలం పరిధిలోని వడ్డెగూడెం గ్రామంకు చెందిన దుద్దుల చంద్రమౌళి గౌడ్ తన కుల వృత్తిలో భాగంగా తాడిచెట్టు ఎక్కి దిగుతున్న సమయంలో ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడిపోయాడు.ఈ ప్రమాదంలో ఆయన నడుము భాగం,రెండు కాళ్లు,మడమలు తీవ్రంగా విరిగిపోవడంతో కుటుంబం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది.కుటుంబం ఆర్థికంగా వెనుకబడిన పరిస్థితిలో ఉండటంతో వైద్య ఖర్చులు భరించడం కష్టంగా మారింది.ఈ విషయాన్ని తెలంగాణ గౌడ సంఘం జనగామ జిల్లా అధ్యక్షులు గడ్డం రాజు గౌడ్ కౌండిన్య అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా ట్రస్ట్ సభ్యులకు తెలియజేశారు.బాధితుడి పరిస్థితిని తెలుసుకున్న కేఏఎన్ఏ ట్రస్ట్ సభ్యులు వెంటనే స్పందించి మానవత్వాన్ని చాటుకున్నారు.బాధిత కుటుంబానికి తక్షణ సహాయంగా రూ.10,000 ఆర్థిక సహాయాన్ని అందజేయాలని నిర్ణయించారు.ఈ సందర్భంగా కేఏఎన్ఏ స్థానిక ప్రతినిధులు నాతి గణేష్,బాల్నే రామచంద్రుడు సహకారంతో తెలంగాణ గౌడ సంఘం జిల్లా అధ్యక్షులు గడ్డం రాజు గౌడ్,గ్రామ సర్పంచ్ కుల్ల మోహన్ రావు చేతుల మీదుగా బాధితుడు దుద్దుల చంద్రమౌళి గౌడ్ కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేశారు.ఈ సహాయం కుటుంబానికి కొంత ఊరటనిచ్చిందని గ్రామస్తులు తెలిపారు.ముందుకు వచ్చి సహాయం చేసిన కేఏఎన్ఏ సంస్థకు తెలంగాణ గౌడ సంఘం ప్రతినిధులు,గ్రామ గౌడ సంఘం సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.విదేశాల్లో ఉన్నప్పటికీ తమ సమాజానికి చెందిన బాధితులకు సహాయం చేయడం అభినందనీయమని పేర్కొన్నారు.భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగించాలని వారు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కుల్ల మోహన్ రావు,గౌడ సంఘం అధ్యక్షులు మేరుగు నరసింగ గౌడ్,గిరగాని యాదగిరి గౌడ్,దుద్దుల్లే కొమురయ్య గౌడ్,స్వామి గౌడ్,మామిడి శీను తదితర గౌడ సంఘం సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# తక్షణ శక్తిని ఇచ్చేందుకు ఏవి ఉత్తమమైనవి.. ఖర్జూరాలు లేదా అరటి పండ్లు..?

హెల్త్ న్యూస్, 24 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): వ్యాయామం చేయడానికి ముందు, చేసిన తరువాత అలాగే కొన్ని సందర్భాల్లో శరీరానికి తక్షణ శక్తి అవసరమవుతుంది. తక్షణ శక్తి అవసరమైన సందర్భాల్లో చాలా మందికి వెంటనే గుర్తుకు వచ్చేవి అరటిపండ్లు, ఖర్జూరాలు. ఇవి సరసమైన ధరల్లో లభించడంతో పాటు తీసుకువెళ్లడం కూడా చాలా సులభం. ఇవి కార్బోహైడ్రేట్లతో నిండి ఉంటాయి. శరీరం శక్తి కోసం వీటిని గ్లూకోజ్ గా మారుస్తాయి. దీంతో మనకు తక్షణ శక్తి లభిస్తుంది. అయితే ఖర్జూరం, అరటిపండ్లల్లో తక్షణ శక్తి ఇవ్వడంలో ఏవి బాగా పని చేస్తాయి. శక్తి వేటిలో ఎంత త్వరగా విడుదల అవుతుంది, శక్తి ఎంతకాలం ఉంటుంది.. వంటి విషయాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.



ఖర్జూరాల్లో శక్తి అధికం..

ఖర్జూరాలు చిన్నవిగా ఉంటాయి. కానీ చాలా శక్తి వంతంగా పనిచేస్తాయి. గ్లూకోజ్, ఫ్రక్టోజ్ వంటి సహజ చక్కెరలు వీటిలో అధికంగా ఉంటాయి. ఇవి నీటి శాతాన్ని తక్కువగా కలిగి ఉంటాయి. కనుక పోషకాలు కేంద్రీకృతమై ఉంటాయి. ఇవి సులభంగా జీర్ణమవుతాయి. కనుక శరీరం వీటిని త్వరగా గ్రహిస్తుంది. ఇక వీటిని వ్యాయామాలకు ముందు, దీర్ఘ వ్యాయామాలలు లేదా క్రీడల సమయంలో, శరీరానికి త్వరగా శక్తి అవసరమైనప్పుడు తీసుకోవచ్చు. ఇవి శరీర బరువును అంతగా పెంచవు కానీ శక్తిని అందిస్తాయి కనుక అథ్లెట్లు వీటిని ఎక్కువగా తీసుకుంటూ ఉంటారు.

సమతుల్య శక్తికి అరటి పండ్లు..

అలాగే అరటిపండ్ల విషయానికి వస్తే ఇవి సమతుల్య శక్తిని అందిస్తాయి. ఇవి అందించే శక్తి ఎక్కువ కాలం పాటు ఉంటుంది. అరటిపండ్లు సాధారణ, సంక్లిష్ట కార్బోహైడ్రేట్ల మిశ్రమం. వీటిలో నీటి శాతం, ఫైబర్ ఎక్కువగా ఉంటుంది కనుక ఇవి నెమ్మదిగా జీర్ణమవుతాయి. వ్యాయామానికి 30 నుండి 60 నిమిషాల ముందు వీటిని తీసుకోవడం మంచిది. అరటిపండ్లు శక్తి స్థాయిలను త్వరగా గరిష్ట స్థాయికి చేరుకోకుండా స్థిరంగా ఉంచడంలో సహాయపడతాయి. ఖర్జూరాలు తక్షణ శక్తిని అందిస్తాయి. అరటిపండ్లు మితమైన, స్థిరమైన శక్తిని అందిస్తాయి.

వేటిని తినాలి..?

సహజ చక్కెరలు ఖర్జూరాల్లో అధికంగా , అరటిపండ్లల్లో మధ్యస్థంగా ఉంటాయి. ఫైబర్ కంటెంట్ ఖర్జూరాల్లో తక్కువగా, అరటిపండ్లల్లో ఎక్కువగా ఉంటుంది. ఖర్జూరాలు చాలా త్వరగా జీర్ణమవుతాయి. అరటిపండ్లు నెమ్మదిగా జీర్ణమవుతాయి. వ్యాయామం చేసే ముందు, వ్యాయామం చేసే సమయంలో తీసుకోవడానికి ఖర్జూరాలు అనువుగా ఉంటాయి. వ్యాయామానికి గంట ముందు తీసుకోవడానికి అరటిపండ్లు అనువుగా ఉంటాయి. తక్షణ శక్తి కోసం ఖర్జూరాలను తీసుకోవడం మంచిది. స్థిరమైన, సంపూర్ణ శక్తి కోసం అరటిపండ్లను తీసుకోవడం మంచిది. ఖర్జూరాలు, అరటిపండ్లు శక్తిని అందించడంలో రెండూ ఎంతో సహాయపడతాయి. అయితే వీటిని శరీర శక్తి అవసరాలను బట్టి దేనిని తీసుకోవాలో ఎవరికి వారు నిర్ణయించుకోవాలని

# హైబీపీ మందులను వాడుతున్నారా..? అయితే ఈ తప్పులను చేయకండి..!

హెల్త్ న్యూస్, 24 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): అధిక రక్తపోటు ఇప్పుడు సర్వసాధారణంగా మారిందని చెప్పవచ్చు. చాలా మంది ఇది అతి పెద్ద సమస్య కాదని భావిస్తారు కానీ ఇది నిశ్శబ్దంగా అనేక తీవ్రమైన అనారోగ్య సమస్యలకు దారి తీస్తుంది. గుండె నుండి మూత్రపిండాల వరకు అనేక ముఖ్యమైన అవయవాలకు తీవ్రమైన నష్టాన్ని కలిగిస్తుంది. జీవన శైలిలో మార్పులు, ఆహారపు అలవాట్లల్లో మార్పులు చేసుకోవడం వల్ల అధిక రక్తపోటు సమస్య నుండి చాలా సులభంగా బయటపడవచ్చు. అయితే అన్నిసార్లు రక్తపోటును నియంత్రించకపోవచ్చు. కనుక వైద్యులు రక్తపోటును నియంత్రించడానికి మందులను సూచిస్తూ ఉంటారు. చాలా మంది రక్తపోటు మందులను వాడుతూ ఉంటారు. అయితే వీటిని తీసుకునే సమయంలో చాలా మంది చేసే కొన్ని తప్పుల కారణంగా ఈ మందులు ప్రభావవంతమైన ఫలితాలను ఇవ్వవు. రక్తపోటు మందులు ప్రభావవంతమైన ఫలితాలను ఇవ్వడానికి కొన్ని చిట్కాలను పాటించాల్సి ఉంటుంది. ఈ మందులను తీసుకునే సమయంలో కొన్ని చేయకూడని పనులు కూడా ఉంటాయి. రక్తపోటు మందులు తీసుకునే సమయంలో చేయాల్సిన, చేయకూడని పనుల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.



దుష్ప్రభావాలను తెలుసుకోవాలి..


రక్తపోటు నియంత్రణకు వైద్యులు సూచించిన మోతాదులో మందులు తప్పకుండా వాడాల్సిందే. మందుల విషయంలో మోతాదు, సమయాన్ని వైద్యుల సూచన మేరకు పాటించాల్సిందే. మందులను తగిన మోతాదులో తీసుకోవడం వల్ల రక్తప్రవాహంలో స్థిరమైన స్థాయిలు ఎల్లప్పుడూ నిర్వహించబడతాయి. మందులను తీసుకుంటూనే ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవాలి. ప్రతిరోజూ వ్యాయామం చేయాలి. శరీర బరువును అదుపులో ఉంచుకోవాలి. ఒత్తిడిని అదుపులో ఉంచుకోవాలి. చక్కటి జీవనశైలిని పాటించడం వల్ల తీసుకునే మందుల ప్రభావం మరింత ఎక్కువగా ఉంటుంది. అలాగే రక్తపోటు మందులను వాడడం వల్ల కలిగే దుష్ప్రభావాలను తెలుసుకోవడం కూడా చాలా మంచిది. కొన్నిసార్లు ఈ మందులు కాళ్ల వాపు, పొడి దగ్గు, మైకం వంటి దుష్ప్రభావాలను కలిగిస్తాయి. కనుక మందులను వాడే సమయంలో అటువంటి లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యుడిని సంప్రదించాలి.

తరచూ తనిఖీలు అవసరం..

రక్తపోటును పర్యవేక్షించడానికి క్రమం తప్పకుండా వైద్యుడితో తనిఖీ చేయించుకోవాలి. దీంతో మందుల్లో సర్దుబాట్లు చేసుకునే అవకాశం ఉంది. అలాగే వైద్యుడిని సంప్రదించడానికి ముందు నుండే ఇంట్లో రక్తపోటును పరీక్షించుకోవాలి. రీడింగ్ లను నమోదు చేసి ఉంచుకోవాలి. రక్తపోటుకు మందులను వైద్యుడిని సంప్రదించిన తరువాతే వాడాలి. వైద్యుడిని సంప్రదించకుండా ఇష్టం వచ్చినట్టు మందులను వాడకూడదు. నచ్చినట్టు మందులను వాడడం వల్ల అనారోగ్య సమస్యలు ఎక్కువయ్యే అవకాశం ఉంది. అలాగే మందులు వాడడం వల్ల రక్తపోటు అదుపులో ఉంటుంది కదా అని కొందరు వెంటనే మందులు తీసుకోవడం తగ్గిస్తారు. ఇలా చేయడం అస్సలు సరైన పద్ధతి కాదని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఇలా చేయడం వల్ల రక్తపోటు మరింత ఎక్కువయ్యి హైపర్ టెన్షన్ వస్తుందని వైద్యులు తెలియజేస్తున్నారు.

నీళ్లను అధికంగా తాగాలి..

అలాగే రక్తపోటుకు మందులు వాడే వారు ఇతర అనారోగ్య సమస్యలకు వాడే మందుల గురించి వైద్యుడికి ముందుగానే చెప్పడం మంచిది. రక్తపోటుతో బాధపడే వారు నీటిని ఎక్కువగా తీసుకోవాలి. శరీరం ఎల్లప్పుడూ హైడ్రేటెడ్ గా ఉండేలా చూసుకోవాలి. మద్యం తాగడం మానేయాలి. మందులను వాడే విషయంలో ఇలా తగిన జాగ్రత్తలు తీసుకుంటూనే జీవనశైలిలో మార్పులు చేసుకోవాలి. పొటాషియం అధికంగా ఉండే ఆహారాలను తీసుకోవాలి. పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలను ఎక్కువగా తీసుకోవాలి. ఒత్తిడి అదుపులో ఉండేలా ధ్యానం, యోగా వంటివి చేయాలి. ఇలా తగిన జాగ్రత్తలు తీసుకుంటూ రక్తపోటు మందులను వాడడం వల్ల మందుల ప్రభావం అధికంగా ఉంటుదని వైద్యులు తెలియజేస్తున్నారు.



# క్రీడలు





## ఉత్కంఠ మ్యాచ్‌లో పాకిస్తాన్‌పై ఘన విజయం.. సెమీస్‌కు ఇంగ్లాండ్




స్పోర్ట్స్ న్యూస్, 24 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): టీ20 ప్రపంచకప్, సూపర్-8లో భాగంగా పాకిస్తాన్‌తో జరిగిన మ్యాచ్‌లో ఇంగ్లాండ్ జట్టు ఘన విజయం సాధించింది. పాకిస్తాన్ నిర్దేశించిన 165 పరుగుల లక్ష్యాన్ని చివరి వరకు పోరాడి ఛేధించారు. మొత్తంగా 19.1 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయిన ఇంగ్లాండ్.. 2 వికెట్ల తేడాతో గెలుపొందింది. ఇంగ్లాండ్ బ్యాటర్లలో హ్యారీ బ్రూక్ (100), విల్ జాక్స్(25) పోరాడి జట్టుకు విజయాన్ని అందించారు. పాకిస్తాన్ బౌలర్లలో షహీన్ ఆఫ్రీది నాలుగు వికెట్లు, ఉస్మాన్ తారిఖ్, నవాజ్ చెరో రెండేసి వికెట్లు తీశారు.

ఈ మ్యాచ్‌లో తొలుత టాస్ నెగ్గి బ్యాటింగ్ చేసిన పాక్.. నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 164 పరుగులు చేసింది. పాక్ బ్యాటర్లలో ఓపెనర్ ఫర్హాన్(63) హాఫ్ సెంచరీతో రాణించారు. బాబర్ అజాం(25), ఫఖర్ జమాన్(25), షాదాబ్ ఖాన్(23) పర్వాలేదనిపించారు. ఇంగ్లండ్ బౌలర్లలో డాసన్ 3, జోఫ్రా ఆర్చర్, జెమీ చెరో 2, ఆదిల్ రషీద్ 1 వికెట్ పడగొట్టారు.

## పాక్‌తోనే భారత్ తొలి పోరు.. మహిళల టీ20 వరల్డ్ కప్ షెడ్యూల్ విడుదల




స్పోర్ట్స్ న్యూస్, 24 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): ఇంగ్లాండ్, వేల్స్ వేదికగా జరగనున్న ఐసీసీ మహిళల టీ20 ప్రపంచ కప్ 2026 షెడ్యూల్ అధికారికంగా విడుదలైంది. ఈ మెగా టోర్నమెంట్ కు సంబంధించిన మ్యాచులు జూన్ 12 నుంచి జూలై 5 వరకు జరగనున్నాయి. మొత్తం 12 జట్లు తలపడే ఈ టోర్నీలో భారత్ గ్రూప్-ఏ లో చోటు దక్కించుకుంది. లండన్‌లోని చారిత్రాత్మక లార్డ్స్ మైదానంలో జూలై 5న ఫైనల్ మ్యాచ్ నిర్వహించనున్నారు.

ఈ ప్రతి ష్ఠాత్మకమైన టోర్నమెంట్‌లో భారత మహిళల జట్టు తన పోరాటాన్ని జూన్ 14న చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌తో జరిగే హై-వోల్టేజ్ మ్యాచ్‌తో ప్రారంభించనుంది. గ్రూప్ దశలో భారత్ వరుసగా నెదర్లాండ్స్ (జూన్ 17), దక్షిణాఫ్రికా (జూన్ 21), బంగ్లాదేశ్ (జూన్ 25) జట్లతో తలపడి, చివరగా జూన్ 28న పటిష్టమైన ఆస్ట్రేలియాను ఢీకొట్టనుంది. ఈ మ్యాచ్‌లన్నీ భారత కాలమానం ప్రకారం రాత్రి 7:00 గంటలకు ప్రారంభం కానున్నాయి. టీ20 సిరీస్ విజయంతో మంచి ఊపులో ఉన్న భారత్, ఈ ప్రపంచకప్‌లోనూ అదే జోరును కొనసాగించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

సెమీఫైనల్స్, ఫైనల్ అర్హత ప్రక్రియ

ఈ మహిళల ప్రపంచకప్ మెగా టోర్నమెంట్‌లో మొత్తం 12 జట్లు రెండు గ్రూపులుగా తలపడతాయి. ఒక్కో జట్టు మొత్తం ఐదు మ్యాచులను ఆడనున్నాయి. గ్రూప్ దశ ముగిసే సమయానికి పాయింట్ల పట్టికలో మొదటి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు నేరుగా సెమీఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి. జూన్ 30న జరిగే మొదటి సెమీఫైనల్‌లో గ్రూప్-ఏ టాపర్, గ్రూప్-బీ లో రెండో స్థానంలో నిలిచిన జట్టుతో తలపడుతుంది. జూలై 2న జరిగే రెండో సెమీఫైనల్‌లో గ్రూప్-బీ టాపర్, గ్రూప్-ఏ లో రెండో స్థానంలో నిలిచిన జట్టుతో పోటీపడుతుంది.

గ్రాండ్ ఫైనల్

సెమీఫైనల్స్‌లో విజేతలుగా నిలిచిన రెండు జట్లు జూలై 5న లండన్‌లోని ప్రసిద్ధ లార్డ్స్ మైదానంలో జరిగే గ్రాండ్ ఫైనల్‌లో తలపడతాయి. ఒకవేళ నాకౌట్ మ్యాచ్‌లు టై అయితే, ఫలితం తేలే వరకు సూపర్ ఓవర్ల ద్వారా విజేతను నిర్ణయిస్తారు. అలాగే వర్షం వంటి ప్రకృతి వైపరీత్యాల వల్ల ఆట నిలిచిపోతే, ఐసీసీ నిబంధనల ప్రకారం సెమీఫైనల్స్, ఫైనల్ మ్యాచ్‌లకు 'రిజర్వ్ డే' సౌకర్యం అందుబాటులో ఉంటుంది. ప్రపంచ ఛాంపియన్లుగా అవతరించాలంటే భారత్ తన గ్రూప్‌లో టాప్-2లో నిలవడం అత్యంత కీలకం.

## కష్టాల్లో ఉన్న భారత జట్టు, వదిలేసి వెళ్లిపోయిన రింకు సింగ్




స్పోర్ట్స్ న్యూస్, 24 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): టీ20 వరల్డ్ కప్ లో అవకాశం దక్కించుకున్న రింకు సింగ్ సంచలన నిర్ణయం తీసుకున్నాడు. కష్టాల్లో భారత జట్టు ఉన్న సమయంలో, ఇంటికి పయనమయ్యాడు రింకు సింగ్. టీ20 వరల్డ్ కప్ సూపర్ 8 మ్యాచ్ లు కొనసాగుతున్న నేపథ్యంలో హెల్త్ ఎమర్జెన్సీ పేరుతో, ఇంటికి వెళ్లిపోయాడు రింకు. ఈ మేరకు బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి. సూపర్ 8 లో రేపు జింబాబ్వే, భారత జట్ల మధ్య కీలక మ్యాచ్ జరగనుంది. అయితే తన తండ్రి ఆరోగ్యం విషమించిన నేపథ్యంలో, ప్రాక్టీస్ మధ్యలోనే ఆపేసి హుటా హుటిన సొంతూరుకు వెళ్లిపోయాడు రింకు సింగ్. ఈ న్యూస్ ఇప్పుడు సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. అంతేకాదు భారత జట్టును మధ్యలో వదిలేసిన రింకు సింగ్ ను ఉద్దేశించి ఫ్యాన్స్ కూడా రకరకాల కామెంట్లు పెడుతున్నారు.

ఇంటికి వెళ్లిపోయిన రింకు సింగ్.. అసలు ఏమైందంటే ?

టీ20 వరల్డ్ కప్ టోర్నమెంట్ లో చివరి క్షణంలో రింకు సింగ్ స్థానం దక్కించుకున్నాడు. అతడు ఏడో స్థానం లేదా ఆరవ స్థానంలో బ్యాటింగ్ చేస్తూ ఉంటాడు. టీ20 క్రికెట్ కావడంతో రింకు సింగ్ కు బ్యాటింగ్ చేసే అవకాశం చాలా తక్కువగా వస్తుంది. వచ్చిన అవకాశాన్ని కచ్చితంగా వినియోగించుకోవాలి. ఈ టోర్నమెంట్ లో ఇప్పటి వరకు రింకు సింగ్ పెద్దగా రాణించలేదు. దక్షిణాఫ్రికా వర్సెస్ భారత్ మధ్య జరిగిన మ్యాచ్ లో కూడా రింకు సింగ్ కు అవకాశం వచ్చింది. కానీ పరుగులు ఏమి చేయకుండా వెనుతిరిగాడు రింకు సింగ్. ఇలాంటి నేపథ్యంలో రింకు సింగ్ తీసుకున్న నిర్ణయం హాట్ టాపిక్ అయింది. కష్టాల్లో ఉన్న భారత జట్టును వదిలేసి ఇంటికి వెళ్ళిపోయాడు రింకు సింగ్.

ప్రస్తుతం రింగు సింగ్ తండ్రి ఖాన్ చందు సింగ్ గ్రేటర్ నోయిడా లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం రింకు సింగ్ తండ్రి పరిస్థితి విషమంగా ఉన్నట్లు చెబుతున్నారు వైద్యులు. ఈ సమాచారం రింకు సింగ్ కు అందింది. ఈ నేపథ్యంలోనే భారత జట్టును వదిలేసి ఆసుపత్రికి పయనమయ్యాడు. ప్రస్తుతం రింకు సింగ్ ఆస్పత్రిలోనే ఉన్నట్లు తెలుస్తోంది. అయితే అతడు వెనక్కి వస్తాడా? లేక అక్కడే ఉండిపోతాడా? అనేది తెలియాల్సి ఉంది. రింకు సింగ్ రిటర్న్ అయ్యే విషయం పై క్లారిటీ ఇవ్వలేదు. కానీ రింకు సింగ్ జింబాబ్వేతో జరిగే మ్యాచ్ ఆడకపోతే కొత్త ప్లేయర్ జట్టులోకి వస్తాడు. సంజు శాంసన్ కు అవకాశం ఇస్తారని సోషల్ మీడియాలో వార్తలు వస్తున్నాయి. ఇది ఇలా ఉండగా టీ20 వరల్డ్ కప్ టోర్నమెంట్ లో భాగంగా భారత్, జింబాబ్వే మధ్య చెన్నై వేదికగా మ్యాచ్ జరుగనుంది. ఇందులో భారత్ కచ్చితంగా గెలవాల్సిన పరిస్థితి నెలకొంది.

## మొదటి భార్య శాపనార్థాలు..రెండో పెళ్లిపై శిఖర్ ధావన్ సంచలన పోస్ట్



స్పోర్ట్స్ న్యూస్, 24 ఫిబ్రవరి (క్రాంతి న్యూస్): భారత మాజీ ఓపెనర్ శిఖర్ ధావన్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఒకప్పుడు భారత జట్టులో స్టార్ క్రికెటర్ గా కొనసాగుతూ, ఎన్నో రికార్డులు సొంతం చేసుకున్నాడు. ఒంటి చేత్తో భారత జట్టును కూడా గెలిపించాడు శిఖర్ ధావన్. అలాంటి శిఖర్ ధావన్ లేటెస్ట్ గా రెండో పెళ్లి చేసుకున్నాడు. ఏడాది కాలంగా ఐర్లాండ్ కు చెందిన సోఫీ షైన్ అనే అమ్మాయిని ప్రేమించి పెళ్లాడాడు శిఖర్ ధావన్. ఢిల్లీలో శిఖర్ ధావన్, సోఫీ షైన్ వివాహం జరిగింది. ఈ పెళ్లికి రోహిత్ శర్మ, చాహల్ లాంటి భారత క్రికెటర్లు కూడా హాజరయ్యారు. ఈ పెళ్లికి సంబంధించిన ఫోటోలు కూడా ఇప్పుడు సోషల్ మీడియాను షేక్ చేస్తున్నాయి.

ఆ ప్రచారంపై క్లారిటీ ఇచ్చిన శిఖర్ ధావన్: రెండో పెళ్లి చేసుకున్న నేపథ్యంలో శిఖర్ ధావన్ ఆసక్తికర పోస్ట్ పెట్టారు. తన రెండో పెళ్లిపై జరుగుతున్న ప్రచారానికి చెక్ పెడుతూ ఈ పోస్ట్ పెట్టారు శిఖర్ ధావన్. నిన్ను ఎవరు కూడా పెళ్లి చేసుకోబోరని.. శిఖర్ ధావన్ కు ఆయన మొదటి భార్య శాపనార్థాలు పెట్టిందని కొంతమంది ప్రచారం చేస్తున్నారు. అందుకే రెండో పెళ్లి చేసుకొని శిఖర్ ధావన్ చూపించాడని పోస్టులు వైరల్ చేస్తున్నారు. అయితే ఈ సోషల్ మీడియా ప్రచారంపై శిఖర్ ధావన్ క్లారిటీ ఇస్తూ పోస్ట్ పెట్టారు. తన మొదటి భార్య గురించి జరుగుతున్న ప్రచారం ఫేక్ అంటూ క్లారిటీ ఇచ్చారు. అసత్య ప్రచారాలు చేయకండి ప్లీజ్ అంటూ వెల్లడించారు. తాను ఎప్పుడు పాజిటివిటీని మాత్రమే కోరుకుంటానని తెలిపారు. సోఫీ షైన్ తో తన కొత్త లైఫ్ సంతోషంగా మొదలుపెట్టినట్లు క్లారిటీ ఇచ్చారు




# ఆ సంఘటన నన్ను ఎంతగానో గాయపరిచింది

తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో వరుస విజయాలతో దూసుకుపోతుంది యంగ్ హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్. తాజాగా ఒక ఇంటర్వ్యూలో తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఒక ఆసక్తికరమైన విషయాన్ని వెల్లడించారు. బ్లాక్ బస్టర్ హిట్ 'కార్తికేయ-2' షూటింగ్ సమయంలో జరిగిన ఒక సంఘటన తనను ఎంతగా కలచివేసిందో ఆమె వివరించారు. 'కార్తికేయ-2' షూటింగ్ సమయంలో సెట్స్‌లో ఒక మేకపిల్ల ఉండేదని, దానితో తాను ఎంతో ఇష్టంగా ఆడుకునేదాన్ని అని అనుపమ తెలిపారు. "ఆ మేకపిల్లతో గడపడం నాకు చాలా సంతోషాన్ని ఇచ్చేది. అయితే ఒకరోజు షూటింగ్ గ్యాప్‌లో మాకు మటన్ బిర్యానీ వడ్డించారు. నేను తింటున్న సమయంలో నా అసిస్టెంట్ నా దగ్గరకు వచ్చి నవ్వుతూ.. 'మేడం, మీరు ఇప్పుడు తింటున్నది మీరు ఇందాక ఆడుకున్న మేకపిల్లనే' అని చెప్పాడు" అంటూ ఆనాటి చేదు జ్ఞాపకాన్ని గుర్తు చేసుకున్నారు. అసిస్టెంట్ చెప్పిన మాట వినగానే తాను ఒక్కసారిగా షాక్‌కు గురయ్యానని, వెంటనే వాంతులు చేసుకున్నానని అనుపమ ఆవేదన వ్యక్తం చేశారు.


ఆ సంఘటన తనను ఎంతగా గాయపరిచిందంటే.. అప్పటి నుంచి తాను మటన్ ముట్టుకోవడమే మానేశానని తెలిపారు. దాదాపు కార్తికేయ-2 సమయం నుంచి ఇప్పటి వరకు మటన్ జోలికి వెళ్ళలేదని, అయితే ఇటీవల కాలంలోనే మళ్ళీ నెమ్మదిగా తినడం ప్రారంభించానని ఆమె వెల్లడించారు. ప్రస్తుతం ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ విషయం తెలుసుకున్న వారంతా.. మూగజీవాల పట్ల ఆమెకు ఉన్న ప్రేమే ఆమెను అన్ని ఏళ్లపాటు మటన్‌కు దూరంగా ఉంచిందని, అనుపమ సున్నిత మనస్తత్వాన్ని మెచ్చుకుంటున్నారు. ఇక అనుపమ సినిమాల విషయానికొస్తే.. ఇటీవల 'లాక్‌డౌన్' సినిమాతో అలరించిన అనుపమ, ప్రస్తుతం 'క్రేజీ కళ్యాణం' అనే సినిమాలో నటిస్తున్నారు. ఇందులో తరుణ్ భాస్కర్, రాజు వెడ్స్ రాంబాయి ఫేమ్ అఖిల్ ఉద్దెమారి, వీకే నరేష్ ప్రధాన పాత్రలో కనిపించబోతున్నారు. బద్రప్ప గాజుల దర్శకత్వంలో రాబోతున్న ఈ సినిమాను బూసమ్ జగన్ నిర్మిస్తున్నారు. షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న ఈ మూవీ త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రాబోతుంది.

# బ్లడీ రోమియోగా నేచురల్ స్టార్ నాని




నేచురల్ స్టార్ నాని తదుపరి చిత్రం టైటిల్ అధికారికంగా ఖరారైంది. ఓజి డైరెక్టర్ సుజీత్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాకు **BloodyRomeo** అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ చిత్రంలో నాని రెండు విభిన్న పాత్రలలో కనిపించబోతున్నారు. ఒకవైపు చెఫ్ గా కనిపిస్తూ మరోవైపు నంబర్ 1 గ్యాంగ్‌స్టర్ గా బాక్సాఫీస్ వద్ద రచ్చ చేయనున్నారు. నాని కెరీర్‌లోనే ఇది అత్యంత వైవిధ్యమైన పాత్ర అని చెప్పవచ్చు.

నేచురల్ స్టార్ నాని బర్త్ డే సందర్భంగా బ్లడీ రోమియో గ్లిమ్స్ ను రిలీజ్ చేసారు మేకర్స్. నాని లాంటి నేచురల్ నటుడి నుండి ఇలాంటి వెస్ట్రన్ స్టైల్ మ్యూజిక్ అప్రోచ్ అభిమానులకు ఒక బిగ్ సర్ప్రైజ్ అని చెప్పాలి. నాని సినిమా హైలైట్స్‌లో ఒకటిగా నిలిచేలా ఉంది బ్లడీ రోమియో. అయితే మేకర్స్ మొదట ఈ సినిమాకు "గన్స్ అండ్ రోజెస్" అనే టైటిల్‌ను పరిశీలించింది. కానీ చివరకు 'బ్లడీ రోమియో' అనే టైటిల్‌ను ఫైనలైజ్ చేశారు. అయితే, టైటిల్ డిజైన్ మరియు థీమ్‌లో మాత్రం 'గన్స్ అండ్ రోజెస్' ఎలిమెంట్స్‌ను హైలెట్ చేస్తు డిజైన్ చేసారు. ఇక టీజర్ లోని నం 1 గ్యాంగ్ స్టర్ సాంగ్ చాలా బాగుంది. ముఖ్యంగా ఎండింగ్ సీక్వెన్స్‌లో వచ్చే బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమా రేంజ్‌ను మరో స్థాయికి తీసుకెళ్లేలా ఉందని చెప్పాలి. . నానిసక్సెస్ ట్రాక్ నుజ్ ఈ 'బ్లడీ రోమియో' కంటిన్యూ చేసేలా ఉంది. భారీ బడ్జెట్ పై తెరకెక్కుతున్న ఈ సినిమాను నిహారిక ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్, యూనానిమస్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి.




# వారి కారణంగా నేను ఏడవని రాత్రి లేదు

టాలీవుడ్ నుంచి బాలీవుడ్ వరకు తన నటనతో, అందంతో మంత్రముగ్ధులను చేస్తున్న నటి మృణాల్ ఠాకూర్. బయటకు ఎంతో ఆత్మవిశ్వాసంతో కనిపించే ఈ 'సీతమ్మ'.. కెరీర్ ప్రారంభంలో, వ్యక్తిగత జీవితంలో బాడీ షేమింగ్ వల్ల తీవ్రమైన మానసిక వేదనను అనుభవించానని వెల్లడించింది. శరీర బరువు కారణంగా నెటిజన్లే కాకుండా, తన చుట్టూ ఉన్నవారు కూడా తనను ఎగతాళి చేసేవారని, ఆ సమయంలో తాను ఎదుర్కొన్న ఒత్తిడి గురించి మృణాల్ తాజాగా ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో మనసు విప్పింది.

మృణాల్ మాట్లాడుతూ.. 'శరీర బరువు వల్ల వచ్చిన ట్రోల్స్ చూసి ఏడుస్తూ నిద్రపోయి.. ఉబ్బిన కళ్లతో నిద్రలేచిన రోజులు ఎన్నో ఉన్నాయి. ఆ మాటలు నా ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీశాయి. కానీ, ఒకరోజు జిమ్‌లో ఒక సన్నటి అమ్మాయి నా దగ్గరకు వచ్చి 'నేను మీలాగా మారాలంటే ఏం చేయాలి?' అని అడగింది.. అప్పుడు నాకు అర్థమైంది.. మనం ఎలా ఉన్నా మనల్ని ఇష్టపడేవారు ఉంటారని. మనల్ని మనం గౌరవించుకోవడం మొదలుపెడితేనే ఇతరులు మనకు విలువ ఇస్తారని తెలుసుకున్నాను. వేల మంది ట్రోల్స్ చేసినా వాటిని పట్టించుకోకుండా నీ పని నువ్వు చేసుకుంటూ సాగిపోవాలని అక్షయ్ సర్ చెప్పారు. ఏదైనా సినిమా పాత్ర కోసం సన్నబడాల్సి వస్తే అది వృత్తిలో భాగం కాబట్టి కచ్చితంగా మారాలని ఆయన సూచించారు. అప్పటి నుంచి నేను ఆ మాటలనే ఫాలో అవుతున్నాను' అని మృణాల్ చెప్పుకొచ్చింది. ప్రస్తుతం మృణాల్ చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. బాడీ షేమింగ్ ఎదుర్కొనే వారికి మృణాల్ మాటలు ఒక పెద్ద సపోర్ట్ లా కనిపిస్తున్నాయి.

# కేవలం అందం ఉంటే సరిపోదు



టాలీవుడ్ నుంచి బాలీవుడ్ వరకు గత పదిహేనేళ్లుగా తనదైన ముద్ర వేస్తూ, నేటితరం హీరోయిన్లకు గట్టి పోటీ ఇస్తున్న నటి తమన్నా భాటియా. కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా, విభిన్నమైన కథలను ఎంచుకుంటూ తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఈ 'మిల్కీ బ్యూటీ', తాజాగా సినిమా పరిశ్రమలోని గెలుపోటములపై స్పందించింది. ఇండస్ట్రీలో నిలదొక్కుకోవడం వెనుక ఉన్న అసలు రహస్యం కేవలం అందం మాత్రమే కాదని చెబుతూ ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి.

తమన్నా తాజాగా ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో 'సినిమా ఇండస్ట్రీలో ఏదీ శాశ్వతం కాదు, ప్రతి శుక్రవారం ఇక్కడ తలరాతలు మారిపోతాయి.. మీరు ఎంత కాలం నుంచి పనిచేస్తున్నారు లేదా గతంలో ఎంత గొప్పగా చేశారు అన్నది ముఖ్యం కాదు, ఆ వారం విడుదలయ్యే సినిమా ఫలితమే ప్రజలు మిమ్మల్ని చూసే విధానాన్ని మారుస్తుంది. అందుకే ఈ పరిశ్రమ ఎవరికైనా వినయాన్ని నేర్పుతుంది' అని తమన్నా అభిప్రాయపడింది. అలాగే

'ఇక్కడ సక్సెస్ ఉన్నప్పుడే గౌరవం దక్కుతుంది, అది తనను ఎప్పుడూ నేల మీద ఉండేలా చేస్తుంది' అని ఆమె చెప్పుకొచ్చింది. ముఖ్యంగా తన గ్లామర్ గురించి వస్తున్న వార్తలపై తమన్నా చాలా స్పష్టంగా స్పందించింది.. 'నేను కేవలం అందంగా ఉన్నాననో లేక తెల్లగా ఉన్నాననో నాకు అవకాశాలు వస్తాయని నేను ఎప్పుడూ భ్రమపడలేదు. నేను కేవలం ఒక గ్లామర్ బొమ్మను మాత్రమే కాదు.. అలా ఎవరైనా నాకు పని ఇస్తారని నేను తప్పుడు అంచనా వేయలేదు. అదే సమయంలో, నేను తెలివైన దాన్ని కాదని ఎవరైనా అనుకున్నా నాకు ఎప్పుడూ సమస్యలేదు. నా పని నేను చేసుకుంటూ వెళ్లడమే నాకు తెలుసు' అంటూ తన ఆత్మవిశ్వాసాన్ని చాటుకుంది.

Printed, Published and owned by ----------------------, Printed at ----------------------, H.No. 00000000, ######, #####, 3#####, ##### #####. Telangana State,
Published from ##### #####, H.No. 000000000, ##### #####, ##### #####, ##### ##### ##### #####. ##### #####, Telangana State. Editor: asfghjklqwertt, RNI. No. APTEL/0000/00000, Cell: 1234567890, 0987654321 Email: sample@company.com